

ఉష్ణోగ్రత (అంచనా)

25-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	27
తెనాలి	39	27
నరసరావుపేట	41	25
బాపట్ల	37	28
రెంటచింతల	42	26



మోదీ పర్యటనతో.. పోలీసుల అలర్ట్

- కొత్త వ్యక్తుల కదలికలపై కన్ను
- ఆరు వేల మందితో భద్రతా చర్యలు
- రంగంలోకి కేంద్ర నిఘా, హోంశాఖ వర్గాలు
- హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలపై నిఘా.. తనిఖీలు
- కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఘాతుకంతో మరింత అప్రమత్తం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటన వచ్చే శుక్రవారం సమీపిస్తోంది. పోలీసుశాఖ అప్రమత్తమైంది. కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయడంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలపై నిఘాతో పాటు తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. భారీగా జనం సమీకరణ నేపథ్యంలో ఆరు వేల మందితో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర నిఘా, హోంశాఖ, గూఢాచార వర్గాలు కూడా రంగంలోకి దిగాయి. సభ జరిగే ప్రాంతంపై పోలీసు వర్గాలు డేగ కన్ను వేసి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర బలగాలు ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రధాని సభ, రోడ్ షో మార్గాలన్నింటిపైన నిఘా వర్గాలు కన్నేశాయి. ప్రధాని కార్యాలయంతో పాటు కేంద్ర హోం శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఎప్పటికప్పుడు జిల్లాలోని పరిస్థితులను ఆరా తీస్తూ పోలీస్ ఉన్నతాధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో మే 2న జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. కానిస్టేబుల్ స్థాయి నుంచి కేంద్ర హోం శాఖ వరకు అన్ని విభాగాల అధికారులు ఎవరిస్థాయిలో వారు రంగంలోకి దిగా రు. జమ్మూ కశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర నిఘా వర్గాలతో పాటు కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. రాజధాని ప్రాంతంతో పాటు జిల్లా కేంద్రమైన గుంటూరు పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లో పోలీ సులు ఇప్పటికే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లపై కూడా నిఘా వేశారు. అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తుల కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. ఇప్పటికే లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆయా వ్యక్తులకు సంబంధించి ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని గదులు కేటాయించాలని ఆదేశించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కూడా చేపట్టారు. ఇంతకు ముందు మోదీ సభకు ఐదు వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ప్రణాళిక రూపొందించారు. అయితే పహల్గామ్ ఉగ్రదాడితో అదనపు బలగాలను నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. తాజాగా మరో వెయ్యి మంది సిబ్బందిని అదనంగా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం ఆరు వేల మంది పోలీస్ బలగాలతో పీఎం సభకు ఆరంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద గతంలో జరిగిన మోదీ సభలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ఈ సారి అలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు ఇప్పటి నుంచే పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్ షో మార్గంలో డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మోదీ రోడ్‌షో మార్గంలో పోలీస్ బలగాలు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు కల్వర్టులు, చప్టాలు, రోడ్‌మార్జిన్లలో, పొలాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు రాజధాని ప్రాంతంపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. డ్రోన్ కెమేరాలతో ఆయా ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు. సీసీ కెమేరాల ద్వారా ఆ ప్రాంతంలోని పరిస్థితులను గమనిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు, సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలపై కూడా నిఘా కొనసాగిస్తున్నారు.



వేదిక ప్రదేశంలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ టీం

రాజధానిలోనే ఉన్నతాధికారుల మకాం

ప్రధాని పర్యటన నేపథ్యంలో అవాంఛనీయ ఘట నలకు ఆస్కారం లేకుండా పోలీస్ ఉన్నతాధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు రాజధాని ప్రాం తంలోనే మకాం వేసి రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బం దిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు.



సాగర్ వెలవెల

- జలాశయంలో 139.61 టీఎంసీలు
- డెడ్‌స్టోరేజి పోగా మిగులు 27.43 టీఎంసీలే
- వరద వచ్చే వరకు పొదుపుగా వాడుకోవాల్సిందే
- వచ్చే నెలలో తాగు అవసరాలకు నీటి విడుదలకు అవకాశం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయంలో నీరు నిండుకుంటోంది. మండుతున్న ఎండలతో జలాశయంలో రోజురోజుకు నీరు తరిగిపోతోంది. వరదలు వచ్చే వరకు ఉన్న జలాశయంలోని నీటిని పొదుపుగా వాడుకోవాలి. 312.05 టీఎంసీలు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 139.61 టీఎంసీలు మాత్రమే జలాశయంలో ఉన్నాయి. డ్యామ్‌లో 27.43 టీఎంసీల నీరు వినియోగానికి అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది జూలైలోనే సాగర్‌కు వరద వచ్చింది. ఈ ఏడాది కూడా వర్షాలు పుష్కలంగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో త్వరతగతిన సాగర్‌కు వరదలు రావచ్చని అంచనా వేస్తున్నారు. మే నెల మూడో వారంలో కుడి కాల్వ పరిధిలో తాగు అవసరాలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. 5 నుంచి 8 టీఎంసీల వరకు తాగునీటి అవసరాలకు సరఫరా చేయనున్నారు.

వృథాతోనే ఇప్పుడీ కష్టాలు

సాగర్ జలాశయంలో గత నవంబరులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉంది. దాదాపు 310 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే ఇరు రాష్ట్రాలు సాగర్‌లో అవసరం ఉన్నా లేకున్నా పెద్దఎత్తున కాల్వలకు నీటిని విడుదల చేసి వృథా చేశాయి. డిసెంబరు 1న కూడా 306 టీఎంసీల నీరు ఉంది. ఈ నెల 9న సాగర్ కుడి కాల్వకు నీటి విడుదలను నిలిపేశారు. అప్పటికి జలాశయంలో 142.08 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నాలుగు నెలల్లో 164 టీఎంసీల నీటిని ఇరు రాష్ట్రాలు పోటీ పడి మరీ వాడుకున్నాయి. దీంతో జలాశయంలో నీటి నిల్వలు నిండుకున్నాయి. ప్రస్తుతం జలాశయంలో 139.61 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉన్న నీటిని పూర్తిగా వినియోగించుకునే అవకాశం లేదు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 514.6 అడుగులు ఉంది.

ఆవిరి నష్టం.. 20 శాతం

సాగర్ జలాశయం డెడ్ స్టోరేజి 498 అడుగులు. అంటే 112.18 టీఎంసీల నిల్వ ఉన్నట్లు. అయితే 27.43 టీఎంసీల నీటిని మాత్రమే వాడుకునే అవకాశం ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. సాగర్‌కు వరదలు వచ్చే వరకు ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవాలి. ఎండకు జలాశయంలో ఆవిరి నష్టం దాదాపు 20 శాతం వరకు ఉంటుందని అంచనా. అంటే ఉన్న నీటిలో 4 నుంచి 5 టీఎంసీల వరకు ఆవిరి అవుతుంది. నదీ పరివాహక ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురిసి వరదలు వస్తేనే సాగర్ జలకళ సంతరించుకుంటుంది. సకాలంలో వర్షాలు కురవకపోతే నీటికి గడ్డుకాలమే.


టుబాకో బోర్డు చట్టంలో సవరణలు 8
- గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర వాణిజ్య శాఖ

ఆనందం అధికం
- ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు వేతనాల పెంపు
- ఏకంగా రూ.25 వేలు చేసిన ప్రభుత్వం

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లు 90 శాతం పూర్తి : మంత్రి నారాయణ 6

నా రేటే.. సపరేటు

- విజిలెన్స్‌లో వితండ వాదన
- ఎవర్నీ వదిలేది లేదన్న రీతిలో దోపిడీ
- అడిగినంత ఇవ్వకుంటే రూ.90 లక్షలు ఫైన్ వేస్తామని మైనింగ్ వ్యాపారికి హెచ్చరిక



గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గుంటూ రు విజిలెన్స్, ఎన్ ఫోర్సుమెం ట్‌లోని కొందరు అధికారుల తీరు వివాదాస్పద మవు తోంది. ఇచ్చే దాని కన్నా ఎక్కువ కావాలని పట్టు పడుతుండటంతో వివాదం తలెత్తుతుంది. అడిగి నంత ఇవ్వకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చ రిస్తూ కొందరు అధికారులు దోపిడీకి తెర తీస్తున్నారు. ఇసుక.. రేషన్ బియ్యం.. ఇలా వ్యాపారం ఏ దైనా తమను కలవాల్సిందే అని తెగేసి చెబుతున్నారు. ఇవన్నీ జిల్లా అధికారికి తెలుసో.. లేదో.. కానీ మొత్తానికి పరిస్థితి మాత్రం చేయి దాటిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్‌లోకి వచ్చిన అధికారులు కొందరు కొన్నిరోజులు బాగానే ఉన్నా ఆ తర్వాత వ్యాపారులను పిలిపించి రహస్యంగా మాట్లాడటం మొదలెట్టారు.

రూ.90 లక్షలు.. గుండె గుభేలు

ఆరోపణల నేపథ్యంలో ఈ మధ్య ఓ మైనింగ్ వ్యాపారిని కలిసిన అధికారులు గుండె గుభేలుమనే మాట చెప్పారు. దారికి రాకుంటే రూ.90 లక్షలు ఫైన్ రాస్తామని చెప్పడంతో ఆ వ్యాపారి ఒణికిపోయాడు. చేసేది లేక అడిగినంత ముట్ట జెప్పినట్లు సమాచారం. ఇలాంటి ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఏ పార్టీ అయినా డోంట్‌కేర్

విజిలెన్స్‌లోని ఒకరిద్దరు అధికారులు పార్టీలతో పనిలేకుండా మామూళ్ల కోసం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో నెలకు రూ.50 వేలు ఇస్తే ఇప్పుడు రూ.లక్ష వరకు ఇవ్వాలని రేట్లు పెంచటం జరిగింది. చేసేది లేక అడిగినంత ఇస్తున్నా ఓ అధికారి సపరేటుగా కలవాలని ఒత్తిడి చేస్తున్నాడని వ్యాపారులు కొందరు ఆరోపిస్తున్నారు. వ్యాపారాలు ఎవరు ఎక్కడ వరకు చేయాలో హద్దులు కూడా ఆయనే నిర్ణయిస్తున్నారని చెబుతున్నారు. కొందరు అధికారుల నుంచి ఫోన్ వస్తుంటేనే గుండెలు ఆగినంత పని అవుతోందని వాపోతున్నారు. పల్నాడు, డెల్టాలోని ఇసుక రేవుల్లో మొదట కొద్దిగా హడావుడి చేశారు. ఆ తర్వాత కథ మొత్తం కంచికి వెళ్లింది.

అప్పుడలా.. ఇప్పుడిలా...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించిన వారికే విజిలెన్స్‌లో పోస్టులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ అధికారి ప్రస్తుత ముఖ్యమంత్రి గురించి బహిరంగంగానే నోరు పారేసుకున్నాడని కొందరు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ అధికారి వైసీపీ హయాంలో కూడా కీలకమైన పోస్టు లోనే ఉన్నట్లు గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు అదే అధికారి విజిలెన్స్‌లోకి వచ్చారంటున్నారు. మొత్తంమీద కొందరు విజిలెన్స్ అధికారుల వ్యవహార శైలి ఎవర్నీ ఖాతరు చేయని పరిస్థితిలో ఉన్నట్లు బహిర్గతం అవుతుంది.

రేషన్ మాఫియాపై తాత్సారం

- జిల్లాలో వ్యవస్థీకృతంగా బియ్యం దందా
- నెలకు రూ.3 కోట్ల వరకు పేదల బియ్యంపై దోపిడీ
- వీరయ్యచౌదరి హత్యతో మరిన్ని అంశాలు తెరపైకి
- రేషన్ మాఫియా కోణంలో సాగుతున్న పోలీసుల విచారణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పేదల బియ్యం పెద్దల బొక్కసాలను నింపుతోంది. పేదల ఆకలి ఏమో కానీ పెద్దలకు రూ.కోట్లు ఆర్జించిపెడుతోంది. దీంతో రేషన్ బియ్యం అక్రమాలతో మాఫియా అవతరించింది. బహిరంగంగా రేషన్ బియ్యం మాఫియా అక్రమాలు చేస్తున్నా రాజకీయ అండదండలతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు.



ఎక్కడికక్కడ అనుచరుల చేత రేషన్ దందాను నడిపించి, వ్యవస్థలను నిస్తేజం చేస్తూ నేతలు పబ్బం గడుపుకున్నారు. అయితే ప్రభుత్వం ఏదైనా రేషన్ మాఫియా మాత్రం మారడంలేదు. గత ప్రభుత్వంలో చెలరేగిన వారు ఇప్పుడు కూడా అదే దందా సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలకు రేషన్ దందాలో రూ.3 కోట్లు ఆర్జన వస్తోంది. ఇందులో తిలాపాపం తలా పిడికెడు అన్న చందాన వ్యవహారం ఉంటోంది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కోణాన్ని విచారణ చేపట్టే క్రమంలో రేషన్ మాఫియా పాత్రపై కూడా పోలీసులు దృష్టిసారించారు. దర్యాప్తులో భాగంగా బాపట్ల రూరల్ వెదుళ్లపల్లికి చెందిన ఓ రైస్ మిల్ యజమానిని అదుపులోకి తీసుకున్నారు. రేషన్ మాఫియా ఆగడాలు హత్యల వరకు వెళ్లాయా? అని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అవలంబించిన నిర్లక్ష్య వైఖరే ఇప్పుడు కూడా కొనసాగుతుండడం వల్లే విషయం హత్య దాకా వచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే రీతిన మాఫియాను వదిలేస్తే భవిష్యత్తులో ఇంకెన్ని అనర్థాలను చూడాల్సి వస్తుందనే ఆవేదన

(మిగతా 7లో)

ప్రాణం తీసిన ఈత సరదా

నేల బావిలో దిగి ఇద్దరు విద్యార్థుల మృతి



పప్పుల ఏసురాజు(ఫైల్ ఫొటో) వేమవరపు జశ్వంత్(ఫైల్ ఫొటో)

మాచవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ఇవ్వడంతో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు నేల బావిలో మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, మాచవరం పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపాలెం గ్రామానికి చెందిన పప్పుల ఏసురాజు(16), వేమవరపు జశ్వంత్(9) వేసవి సెలవులు ఇవ్వడంతో ఉదయం మాచవరం, కొత్తపాలెం గ్రామాల మధ్య ఉన్న హసన్ నేల బావిలో ఈతకు వెళ్లారు. ఇద్దరూ బావిలో దూకగా.. వచ్చీరాని ఈతతో ఊపిరాడక ఇద్దరు విద్యార్థులు బావిలో మునిగి మృతి చెందారు. ఈ సమయంలో ఎవరూ వారిని గమనించలేదు. మధ్యాహ్నం యామర్తి అశోక్ అనే వ్యక్తి ఈత కొట్టేందుకు బావిలో దూకగా అతడి కాళ్లకు వారిద్దరి మృతదేహాలు తగిలాయి. అతను భయపడి ఒక్కసారి పైకి వచ్చి చూడగా బావి ఒడ్డున సైకిల్, దుస్తులు ఉండడం గమనించాడు. దీంతో వెంటనే అశోక్ స్థానికులకు సమాచారం చేరవేశాడు. అప్పటికే ఏసురాజు, జశ్వంత్ తల్లిదండ్రులు ఉదయం వెళ్లిన పిల్లలు ఇంత వరకు తిరిగి రాలేదంటూ గ్రామంలో వెతుకులాడుతున్నారు. బావిలో ఎవరో పిల్లలు చనిపో యారన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల హుటాహుటిన బావి వద్దకు వచ్చి ఒడ్డు మీద ఉన్న సైకిల్, దుస్తులను గమనించి అవి తమ పిల్లలవేనని గుర్తించారు. ఈ ఘటనను పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లగా.. ఈతగాళ్ల సాయంతో ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను బయటకు తీశారు. వెంటనే తల్లిదండ్రులు మృతదేహాలపై పడి బోరున విలపి స్తున్న ఘటన కంటతడి పెట్టించింది. ఏసురాజు ఒక్కగా నొక్క కొడుకు కావడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న బాధ వర్ణనాతీతం. ఏసురాజు ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేక పోయాడు. జశ్వంత్ 5వ తరగతిలో చేరాల్సి ఉంది. ఇద్దరూ ఎస్సీ విద్యార్థులు కావడంతో ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. దాచేపల్లి సీఐ భాస్కరరావు, ఎస్ఐ పాపారావు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గురజాల ప్రభుత్వ వైద్యాధికారి కొత్తపాలెం గ్రామానికి చేరుకొని మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

ఎమ్మెల్యే యరపతినేని దిగ్భ్రాంతి

కొత్తపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొప్పుల ఏసురాజు, వేమవరపు జశ్వంత్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం, పార్టీ పరంగా తన వంతు సహాయ సహకాలు అందిస్తానని యరపతినేని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

హత్య కేసులో జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని నరికి హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వేమవరం గ్రామానికి చెందిన వాడితే నాగేశ్వరరావు నాయక్‌కు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీ గురువారం తీర్పు వెలువరించారు. హతుడు షేక్ ఖాదర్ బాబా(32), నిందితుడు నాగేశ్వరావు నాయక్ ఇద్దరిదీ ఒకే ఊరు. ఖాదర్ బాబా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తూ జీవిస్తుంటాడు. మురికిపూడికి చెందిన ఓ మహిళతో అతను సన్నిహితంగా ఉంటున్నాడు. సదరు మహిళతో నిందితుడు నాగేశ్వరావునాయక్ కూడా గతంలో సన్నిహితంగా మెలిగాడు. ఖాదర్ బాబాతో పరిచయమైన తర్వాత నాగేశ్వరరావునాయక్‌ను ఆ మహిళ దూరం పెట్టింది. దీంతో ఆగ్రహించిన నాగేశ్వరావు 2019 జూలై 23న రాత్రి చికెన్ షాప్‌లో నిద్రిస్తున్న ఖాదర్ బాబాను కత్తితో మెడపై నరికి హతమార్చాడు. మృతుడి భార్య షేక్ షాహిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో.. కోర్టు నిందితుడికి శిక్ష, జరిమాన విధిస్తూ.. తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- అడుగడుగునా బోర్లు - జలాలు లాగేస్తున్న మొక్కజొన్న, జొన్న పైర్లు - సాధారణ మోటార్ల స్థానంలో సబ్ మెర్సిబుల్స్



భూగర్భ జలాలతో మొక్కజొన్న పైరుకు నీరు (ఇన్‌సెట్‌లో) జలాలు అడుగంటడంతో మోటార్లను భూమి లోపలికి ఏర్పాటు చేసిన దృశ్యం

వేమూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగుంటుతున్నాయి. ప్రధానంగా జొన్న, మొక్కజొన్న పైర్లకు ఆరుతడులు పెట్టేందుకు రైతులు పూర్తిగా బోర్లు వేసి వాటి ద్వారా భూగర్భ జలాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. వేసవి వచ్చే సరికి భూగర్భ జలాలు అడుగండడం వల్ల సాధారణ మోటార్ల స్థానంలో సబ్ మెర్సిబుల్స్ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో 60 అడుగుల లోతులో ఉండే నీరు ప్రస్తుతం 100 అడుగుల లోతుకు చేరుకుంది. సాధారణ పంపులు వేసినా ఉపయోగంలేని పరిస్థితి ఏర్పడింది. మోటార్లు లేకుండా మంచినీటిని తోడుకునే పరిస్థితి కనబడటం లేదు. చేతి పంపులు తలను కూడా 10 అడుగుల లోతులో వేయాల్సి వస్తోంది. పంట భూముల్లో మోటార్లను కూడా కొంతమేర గోతులు తీసి వాటిలో మోటార్లను అమరిస్తేనే నీటిని లాగగలుగుతున్నాయి. జొన్న, మొక్కజొన్న పైర్లను నియోజకవర్గ ప్రాంతంలో విస్తృతంగా వేయడం వల్ల ఆ పైర్లకు ఆరుతడులు ఎక్కువగా పెట్టాల్సి రావడం వల్ల భూగర్భ జలాల అడుగంటుతున్నాయి. జొన్న, మొక్కజొన్న పైర్లు జలాలను ఎక్కువగా లాగేస్తాయి. గతంలో ఈ ప్రాంతంలో మినుము, పెసర పైర్లు మాత్రమే రైతులు వేసేవాళ్లు. బంగారు తీగ, ఇతర తెగుళ్ల వల్ల ఆ పైర్లను పూర్తిగా వదిలేశారు. మాగాణి భూములు 72,773 ఎకరాలు సాగులో ఉండగా 44,168 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పైర్లు వేశారు. ఈ రెండు పైర్లు నియోజకవర్గంలోని 89 గ్రామాల పరిధిలో రైతులు వేయడం వల్ల ప్రతి గ్రామంలోనూ భూగర్భ జలాలు తగ్గిపోతున్న పరిస్థితులు సంతరించుకున్నాయి. వేసవి ప్రారంభంలోనే మంచినీటి సమస్య ఏర్పడితే మరో పది రోజులు గడిచాక నీటి సమస్య మరింత జఠిలం అవుతుందని గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. జొన్న, మొక్కజొన్న పైర్లు వేయడం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో గ్రామాల్లో మంచినీరు దొరకక పూర్తిగా మంచినీటి పథకాల ద్వారా వచ్చే కుళాయి నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కూడా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల్లో అవగాహన కల్పించి జొన్న, మొక్కజొన్న పైర్లతో సమానమైన ఆదాయం లభించే పైర్లు వేసే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సూచిస్తున్నారు.

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లు 90 శాతం పూర్తి : మంత్రి నారాయణ



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు 90 శాతం పూర్తయినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో మే 2వ తేదీన జరగనున్న ప్రధాని సభ ఏర్పాట్లను గురువారం మంత్రి నారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం 34 వేల ఎకరాలను భూ సమీకరణకు ఇచ్చిన రైతులను ప్రధాని సభ సందర్భంగా గౌరవించే ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చారని మంత్రి వెల్లడించారు. ఇందుకోసం 30 మంది రైతులను ఎంపిక చేసే పనిలో అధికారులు వున్నారని తెలిపారు. సభకు వచ్చే జనం కోసం 11 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అయితే, ఆ సంఖ్యను ఇంకా పెంచాలని సీఎం చంద్రబాబు సూచించారని మంత్రి నారాయణ తెలిపారు. ప్రధాని సభకు 5 లక్షలు మంది ప్రజలు వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అమరావతిలో ఉండాలనేది సీఎం సంకల్పం అన్నారు. గన్నవరం ఎయిర్ పోర్టు ఉన్నా, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉంటే అది అమరావతికే తలమానికమన్నారు. అప్పట్లో హైదరాబాద్‌లో ఒక ఎయిర్ పోర్టు ఉంది. చంద్రబాబు నాయుడు శంషాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణం చేయటంతో హైదరాబాద్ అభివృద్ధి శరవేంగా జరిగిందని మంత్రి వివరించారు. ఉష్ణోగ్రత పెరుగుతుండటంతో ప్రధాని సభకు వచ్చే వారికి చల్లదనం, ఊరటనిచ్చేందేకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రధాని రాజధాని అమరావతి పనుల శంకుస్థాన పైలాన్ ఆవిష్కరించేందుకు అధికారులు వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, సభ ఏర్పాట్ల ఇన్‌చార్జి వీరప్యాండన్, సీఆర్డీఏ చీఫ్ ఇంజనీర్ ధనుంజయ ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వలసకూలీ మృతి



బెల్లంకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై వలస కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో భద్రాచలం జిల్లా కొత్తగూడెం గ్రామానికి చెందిన కేతావత్ రవినాయక్(32) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రవినాయక్ గత ఐదు రోజుల నుంచి వన్నాయపాలెంలో నూతన విద్యుత్ లైన్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు వచ్చాడు. కేంద్ర ప్రభుత్వం నూతన్ లైన్‌లను ఏర్పాటులో భాగంగా రవినాయక్ విద్యుత్ స్తంభంపై విద్యుత్ వైరును చుడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి వీధి లైట్ల మెయిన్‌ను ఆన్ చేయటంతో విద్యుత్ షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

29 నుంచే యథావిధిగా ఏఎన్‌యూ పీజీ పరీక్షలు

పెదకాకాని, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించే పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా ఈ నెల 29 తేదీ నుంచి జరుగుతాయని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ గురువారం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ తేదీలలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. 29 వ తేదీన జరగబోతున్న పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం కావాలని ఆయన సూచించారు. అయితే, ఇటీవల సామాజిక మాధ్యమాలలో, పలు సోషల్ మీడియా వేదికలపై వస్తున్న అసత్య సర్క్యులర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకలు

లాంఫాం(తాడికొండ) ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకలు ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా విజయలక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1964 సంవత్సరంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ వేడుకలను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథులుగా గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని తెలిపారు.

మానవ మేధకు గుర్తింపు..

ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు

పెదకాకాని, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మానవ మేధకు గుర్తింపు ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, రాష్ట్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ విభాగం, ఉన్నత విద్యా మండలి, ఆచార్య నాగార్జున విద్యాలయం 'రూసా' సంయుక్తంగా ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచాన్ని అన్ని రంగాల్లో తమ మేధో సంపత్తితో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న భారతీయులు.. స్వదేశంలో ఎంతవరకు తమ మేధస్సును దేశ అభివృద్ధికి ఉపయోగిస్తున్నారని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలన్నారు. ప్రజలు, అధ్యాపకులు, విద్యార్థులు తమ మేధస్సుతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలని, నూతన ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలు, విద్యా కేంద్రాలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల్లోనిఅంతర్గతంగా ఉన్న మంచి ఆలోచనలు, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను ప్రోత్సహించాలని అధ్యాపకులకు సూచించారు. ఏప్రిల్ 26 వ తేదీన ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం సందర్భంగా తమ తమ విద్యా కేంద్రాలలో విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక దృష్టితో విద్యాభ్యాసం సాగించాలని సూచించారు. ఈ సదస్సుకు ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి సభాధ్యక్షులుగా, ఆచార్య ఎం.మురళీమోహన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పాల్గొన్నారు. ఈ సదస్సుకు కీలక ఉపన్యాసకులుగా నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు చెందిన డాక్టర్ బీజాయ్ కుమార్ సాహు, ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్, ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, ఎం.అజిత్, ఆచార్య జి.చెన్నారెడ్డి, ఆచార్య డీవీ హర్షవర్ధన్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ డాక్టర్ డి.అనిల్‌కుమార్, రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.



ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య కె రామ్మోహనరావు

పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 30న నిర్వహించనున్న పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ, శిక్షణ బోర్డు గురువారం తెలిపింది. విద్యార్థులు ఏపీ పాలీసెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొంది. హాల్ టికెట్లు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్టు లేదా ఇతర ఆఫ్ లైన్ మార్గాల్లో పంపబోమని స్పష్టం చేసింది. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

రైతు ఉత్పత్తి సంఘాల ప్రోత్సాహానికి కమిటీలు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల్ని సమర్థంగా అమలు చేయడానికి, రాష్ట్రంలో 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో రాష్ట్ర స్థాయిలో సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు సవరించిన మార్గదర్శకాలతో ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నాబార్డు అధికారులు సభ్య కార్యదర్శులుగా ఉండే రాష్ట్ర కమిటీకి వ్యవసాయశాఖ డైరెక్టర్, జిల్లా కమిటీకి జిల్లా వ్యవసాయ అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో సమానంగా చూడాలని తెలిపింది. ఎఫ్‌పీవోలకు ఎరువుల సరఫరా, ఎఫ్‌పీవోల ఉత్పత్తులకు మార్కెటింగ్, విలువ జోడింపునకు మౌలిక సదుపాయలు కల్పించనున్నట్టు పేర్కొంది.

జూనియర్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీలు కొనసాగింపు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న 957 మందిని కొనసాగించేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 28 వరకు వారు కొనసాగుతారని తెలిపారు. మొత్తం ఏడాదిలో ఒక నెల 8 రోజులు బ్రేక్ ఉంటుందన్నారు.



పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

సబ్ జూనియర్ విజేతగా మద్దిరాల ఎడ్లు

వినుకొండటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఆరు రోజుల నుంచి హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి జరిగిన సబ్ జూనియర్స్ విభాగం పోటీల్లో ప్రకాశం జిల్లా నాగోలుపాడు మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లు 4,788.9 అడుగులు లాగి మొదటి బహుమతి, హైదరబాదుకు చెందిన ప్రగతి రిసార్ట్స్ ప్రీతిక రామకృష్ణ ఎడ్లు 4,775 అడుగులు లాగి ద్వితీయ స్థానం, కృష్ణాజిల్లా పెనమలూరు తాలూకా పెద్ద పులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్‌కు చెందిన ఎడ్లు 4,250 అడుగులు లాగి తృతీయ స్థానం, కృష్ణాజిల్లా మల్లవల్లికి చెందిన అక్కినేని ముకుల్ సత్యచౌదరి ఎడ్లు 3,750అడుగులు లాగి 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుంట్ల వీఎస్‌పీ హాస్పిటల్‌కు చెందిన ఎడ్లు 3,501 అడుగులు లాగి 5వ స్థానం, కృష్ణాజిల్లా ఆలవారిపాలేనికి చెందిన మేక రామకృష్ణ, బొంతు లోకేష్, బసివిరెడ్డికి చెందిన ఎడ్లు 3,500 అడుగులు లాగి 6వ స్థానం, ప్రకాశం జిల్లా కంభం మండలం లాయర్ కృష్ణకు చెందిన ఎడ్లు 3,314 అడుగులు లాగి 7వ స్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెం ఎల్లం సాంబశివరావు ఎడ్లు 3,283అడుగులు లాగి 8వ స్థానం, కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ప్రొద్దుటూరుకు చెందిన కట్టుగోలు రవీంద్రాఎడ్డికి చెందిన ఎడ్లు 3,205 అడుగులు లాగి 9వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు బోడెపూడి వెంకటేశ్వర్లు, కట్టా కోటయ్య, నలబోతు రామకోటేశ్వరరావు, నరసయ్య, నలబోతు కోటేశ్వరరావు, సూరాబత్తిని హనుమంతరావు, మద్దిరెడ్డి కేశవరెడ్డి, గుంటూరు ఆంజనేయులు, వజ్జా హనుమంతరావు, గుండాల శాంతయ్య, తులవ శ్రీనివాస్, సల్లూరి రామారావులు నగదు బహుమతులు ప్రదానం చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 514.60 అడుగులు ఉంది. ఇది 139.61 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,18,944 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,12,028 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,18,944 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 51,104 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా		
341	10000	13000	బ్యాడిగి 5531	--	--
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12400
సూపర్10	10000	12600	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

బాపట్ల వార్తలు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన శ్రీచైతన్యస్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ గురువారం అభినందించారు. 596 మార్కులు సాధించిన శ్రీప్రణస్య, 595 మార్కులు సాధించిన భువనకీర్తి, 594మార్కులు సాధించిన తనూజలను అభినందించి భవిష్యత్తులో మరెన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి జోన్ కోఆర్డినేటర్ గోపీచంద్, డీన్ రవికుమార్, అజయ్‌కుమార్ తదితరులున్నారు.

ఎస్టీల గృహనిర్మాణాలకు ఆర్థిక సాయం అందించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి
● కలెక్టర్‌ను కలిసిన న్యూఢిల్లీకి చెందిన హబిటేట్ ఫర్ హ్యూమానిటి ఇండియా బృందం

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లబ్ధిదారులైన ఎస్టీల గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన హబిటేట్ ఫర్ హ్యూమానిటి ఇండియా బృందం గురువారం బాపట్ల జిల్లాకు చేరుకుంది. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బృందం మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. సమాజంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం గూడు కల్పించటం సంతోషదాయకమని కలెక్టర్ చెప్పారు. ఆర్థిక స్థోమత లేక చాలా మంది అర్థాంతంగా గృహనిర్మాణాలను నిలిపివేసిన విషయాలను బృందంతో కలెక్టర్ చర్చించారు. అత్యంత నిరుపేదలకు ప్రభుత్వం సహాయం అందిస్తున్నప్పటికి డబ్బులు లేక కొందరు గృహనిర్మాణాలు నిలిపవేశారని వివరించారు. అలాంటి నిరుపేదలకు మీ వంతు ప్రోత్సాహం అందించాలని కోరారు. అత్యంత నిరుపేద


సమావేశంలో కలెక్టర్ వెంకటమురళితో మాట్లాడుతున్న న్యూఢిల్లీకి చెందిన హబిటేట్ ఫర్ హ్యూమానిటి ఇండియా బృంద సభ్యులు

లైన ఎస్టీల గృహనిర్మాణాలకు సంస్థ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని హబిటేట్ ఫర్ హ్యూమానిటి ఇండియా డైరెక్టర్ జస్టిస్ జెబాకుమార్ తెలిపారు. బహుళజాతి కార్పొరేట్ సంస్థల సహకారంతో ఎస్టీలకు సహాయం చేయాలని సంస్థ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఎస్టీకాలనీలో గృహనిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తామన్నారు. అనంతరం పట్టణంలోని తూర్పుబాపట్ల లేఅవుట్‌ను కలెక్టర్‌తో పాటు బృంద సభ్యులు సందర్శించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్

ఎస్టీలు, దివ్యాంగుల కోసం ప్రతినెల మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తమ సమస్యలను విన్నవించుకోవటానికి జిల్లాలోని దివ్యాంగులు, ఎస్టీలు ఈ గ్రీవెన్స్ సెల్‌కు రావచ్చు అన్నారు. ఈ విష యాన్ని జిల్లాలోని ఎస్టీలు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 25వ తేది ఉదయం 11గంటల నుంచి గ్రీవెన్స్ జరుగుతుందన్నారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్ సెల్

కొల్లూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆనందబాబు హాజరవుతారని, ఆయన ఆధ్వర్యంలోనే కార్యక్రమం జరుగుతుందని మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యేకు తెలియజేసి పరిష్కరించుకోవాలని మురళీకృష్ణ సూచించారు.

లిక్కర్ స్కాం పాపాల పుట్ట బద్దలైంది

● కొల్లా వీరయ్యచౌదరి

బాపట్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో సిట్ చేసిన విచారణతో నిందితుడు రాజ్‌కసిరెడ్డి గుట్టువిప్పి మాజీ ముఖ్యమంత్రి జగన్ చెప్పినట్లే తాము చేశామని సూత్రదారులు, పాత్రదారుల పేర్లు కుండబద్దలు కొట్టటంతో అన్ని ఆధారాలతో లిక్కర్ స్కాం పాపాల పుట్ట బద్దలైందని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ నిందితుల జాబితాలో మిధున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి ఉండటం వైసీపీ అరాచకాలకు నిదర్శనమన్నారు. ప్రజాసంపద వైసీపీ హయాంలో ఎంతగా దోపిడికి గురైందో దీనిని బట్టి ఊహించవచ్చునని కొల్లా పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కొల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను ఏపీడీ సువార్త పరిశీలన చేశారు. గురువారం మండలపరిధిలోని అనంతవరం గ్రామ పంచాయతీలో జరుగుతున్న పంట కుంటల నిర్మాణాన్ని ఏపీడీ పరిశీలించారు. నిర్మాణంలో పనులు చేస్తున్న కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. పంట కుంట నిర్మాణం చక్కగా చేస్తున్నారని కూలీలను అభినందించారు. పరిశీలనలో ఏపీవో లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ● బాపట్లలో భారీ ప్రదర్శన, మానవహారం

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. జమ్ము-కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండ భారతదేశం మొత్తాన్ని కన్నీటి సముద్రంలో ముంచేసిందన్నారు. ఈ దాడిలో 28మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారన్నారు. దీనిని నిరసిస్తూ గురువారం రాత్రి బాపట్లలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయనవారి ఆత్మకుశాంతి చేకూరాలని కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలు పట్టుకొని కొవ్వొత్తులతో కొత్తబస్టాండ్ దగ్గర నుంచి పాతబస్టాండ్ మీదగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి మృతులకు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొలపల శ్రీనివాసరావు, కూచిపూడి శ్యామ్ సుందర్, విన్నకోట సురేష్, భీమాలీలాకృష్ణ, షాకా, పల్లం సరోజినీ, ఎం.శేషుకృష్ణ, బూర్లె రామసుబ్బారావు, విన్నకోట సురేష్, కె.రమేష్, జి.గిరిజారాణి, కాగిత నాగభూషణమ్మ, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, శీలం శ్రీనివాసరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


ఉగ్రవాద చర్యలకు నిరసనగా జాతీయజెండాలు పట్టి ప్రదర్శన చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ,కూటమి నాయకులు తదితరులు

దాడిని నిరసిస్తూ మౌనదీక్ష

జనసేనపార్టీ ఆధ్వర్యంలో గురువారం మౌనదీక్ష చేపట్టారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు జిడుగు విజయమాధురి, ఊసా మాధవి, ఎ.నాగమల్లేశ్వరి, ఊసా ప్రసాద్, సత్యనారాయణ, కొక్కిరాల రాజేంద్ర, గంటా నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీవ్రవాదులపై చర్యలు తీసుకోవాలి

● జనసేనపార్టీ పట్టణాధ్యక్షుడు మహేష్

రేపల్లె, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన దుండగులపై చర్యలు తీసుకోవాలని జనసేనపార్టీ పట్టణాధ్యక్షుడు రానంశెట్టి మహేష్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణ బయట సంతాప దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు రేపల్లె బార్ అసోసియేషన్ మొబైల్‌షాపు యూనియన్ సంఘీ భావం తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

రేపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక హిందువులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు అతి కిరాతకంగా దాడి చేయడం హేయమని బీజేపీ సీనియర్ నాయకులు పిన్ని సాంబశివరావు అన్నారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మృతుల కుటుంబాలకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలి : ఎంపీపీ

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అన్నారు. మండలపరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో గురువారం జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఆయాశాఖల అధికారులతో కలిసి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు గాంధీజీ, బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ డి.మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

● **కర్లపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):** నల్లమోతువారిపాలెం సెగ్మెంట్ పరిధిలోని కొత్తనందాయపాలెంలో,నల్లమోతువారిపాలెంలో జరిగిన ప్రత్యేక గ్రామసభల్లో ఎంపీటీసీ, మాజీ సైనిక సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పాల్గొని పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి వివరించారు.

● **భట్టిప్రోలు(కొల్లూరు), (ఆంధ్రజ్యోతి):** పంచాయతీరాజ్ వ్యవస్థపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ దారా రవి కిరణ్మయి పేర్కొన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలి

● డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్

బాపట్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చదువు రాని వారికి చదవటం, రాయటం నేర్పించటంతోపాటు వారికి ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతను అందజేసి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో సెర్ప్ ద్వారా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ కోరారు. ఈ విషయమై గురువారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సంఘాలు, అంగన్‌వాడీ ఆయాలు, పాఠశాలలో పనిచేసే వంటవారు, సహాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ కార్మికుల్లో చదువురానివారికి ఉల్లాస్ ద్వారా అక్షరాలు నేర్పిస్తామన్నారు. మొదటి విడతలో 15,268 మంది నమోదు కాగా రెండో విడత ఉల్లాస్


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కార్యక్రమంలో 31,228 మంది చదువు రాని వారిని నమోదు చేసుకొని అక్షరాస్యులుగా చేయటం లక్ష్యంగా నిర్దేశించారన్నారు. కావున ప్రతిఒక్కరు తరగతులకు హాజరైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో కోరారు. సమావేశంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరెడ్డి, నోడల్ అధికారి మధుసూదనరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, మెప్మా సీఎంఎం, సుబ్రహ్మణ్యం, డీఈవో ఎస్ పురుషోత్తం, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

గంజాయికేసులో నిందితులకు శిక్ష

● చందోలు పోలీసులను అభినందించిన ఎస్పీ

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు జైలుశిక్ష, జరిమాన విధించినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఒక్కొక్కరికి మూడు సంవత్సరాలు జైలు, 10వేల రూపాయల జరిమాన విధిస్తూ గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వీఏఎల్ సత్యవతి తీర్పునిచ్చారన్నారు. నిందితులకు శిక్షపడేవిధంగా చందోలు పోలీసు అధికారులు, సిబ్బంది చేసిన కృషిని గురువారం ఎస్పీ అభినందించారు.

బాపట్ల నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని రసూల్ పేటలో నివాసం ఉండే షేక్ నజీర్‌బాషా గృహంలో అప్పటి చందోలు ఎస్ఐ చెన్నకేశవులు సిబ్బందితో కలిసి సోదా చేసి 2017 నవంబరు 19వ తేదిన 470గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి రూరల్ సీఐ కోటేశ్వరరావు కేసు సమగ్ర దర్యాప్తు చేసి నజీర్‌బాషాతోపాటు చుండూరు మండలం దుండివారిపాలెం గ్రామానికి చెందిన మారెడ్డి రోహిత్‌రెడ్డి, ప్రకాశంజిల్లా నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన కరణం సుబ్రహ్మణ్యంలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. గుంటూరు మొదటి అదనపుజిల్లా కోర్టులో కేసు విచారణ చేపట్టారు. ఏపీపీ వజ్రాల రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించి ముద్దాయిలపై మోపబడిన నేరాన్ని తగిన సాక్షాధారాలతో రుజువు చేయటంతో జడ్జి వీఏఎల్ సత్యవతి ముగ్గురికి మూడు సంవత్సరాలు జైలు, 10వేల రూపాయల చొప్పున జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారని చెప్పారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసేవిధంగా చూడాలి

● ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జలమయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జలమయ్య

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసేవిధంగా కంపెనీలపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.జలమయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు క్వింటాల్‌కు రూ.18వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ సంస్థలను వెంటనే రంగంలోకి దింపి కౌలు రైతులు పండించిన పొగాకు మొత్తం కొనుగోలు చేసేవిధంగా చూడాలన్నారు. పొగాకు మార్కెట్‌కు వచ్చి రెండు నెలలు అవుతున్నా కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి మంచి ఆకును కూడా కేవలం క్వింటాల్ 4వేల నుంచి 5వేల రూపాయలకు అడుగుతున్నారని దీనివల్ల ఎకరానికి లక్ష రూపాయలకు పైగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కావున గత సంవత్సరంలో చెల్లించిన ధరకే కొనుగోలు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, కౌలురైతుల సంఘంనాయకులు రాజుల అబ్రహం, ఎం నాగేశ్వరరావు, నందిగల లోకయ్య, పాలపర్తి సుబ్బారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ సేవలు అభినందనీయం

కలెక్టర్ జేవీ మురళి

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అందించిన సేవలు మరువరానివని కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు.


బదిలీపై వెళుతున్న జేసీ ప్రఖర్‌జైన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల జేసీగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ప్రఖర్‌జైన్‌కు వీడ్కోలు, అభినందన సభ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తదితరులు హాజరై ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీపై ఆర్టీజీఎస్‌కు వెళుతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ బాపట్ల సచివాలయానికి రాష్ట్ర ప్రణాళికశాఖ ప్రతినిధి


ఈస్ట్‌బాపట్ల గ్రామసచివాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రతినిధి శ్రేయఘోష్

బాపట్లరూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ బాపట్ల గ్రామసచివాలయాన్ని గురువారం రాష్ట్ర ప్రణాళికశాఖా ప్రతినిధి శ్రేయఘోష్ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామసచివాలయాల ద్వారా అమలౌతున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు అర్హులైన పేదవారికి ఎలా అందుతున్నాయని పరిశీలించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటన కోసం ప్రణాళికశాఖ తరఫున ఆమె సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక రకాల సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులైన పేదవారికి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని సచివాలయంలోని అన్నిశాఖలకు సంబంధించిన సిబ్బంది ద్వారా సమాచారాన్ని సేకరించారు. సిబ్బంది తమ సేవలను సమర్థవతంగా అందించటం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చునని పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు, ఉపగణంకాధికారి దాసరి శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.

వెలగపూడి రామకృష్ణ కళాశాలలో అభినందనసభ

నగరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యాబోధనతోపాటు క్రమశిక్షణకు మారుపేరుగా నగరం ఎస్వీఆర్ఎం కళాశాల నిలుస్తుందని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం మార్చి 20, 25 ఇంటర్‌ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తూ కళాశాల యాజమాన్యం, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని విద్యతోపాటు విలువలు నేర్పుతూ భవిష్యత్తులో ముందుకు వెళ్లేందుకు కృషి చేయడం మా బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ పి.అమిరేష్‌రెడ్డి, ఏడీ వి.వెంకటేశ్వరరావు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

చెరుకుపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గురువారం జాతీయపంచాయతీరాజ్ దినోత్సవం చెరుకుపల్లిలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పారిశుధ్య కార్మికులలను పరిశుభ్రంగా ఉంచడంలో వారి కృషి ఎంతో ఉందని వారిని కొనియాడుతూ సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూషన్ చైర్మన్ రాధాకృష్ణమూర్తి వారందరికి సన్మానం చేసి నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాసన్, ఈవో, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పూర్వ విద్యార్థి ఘనంగా సత్కరించారు. గురువారం భట్టిప్రోలులోని టీఎంరావు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 500లకు పైగా మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులను పూర్వ విద్యార్థి నాగకృష్ణ పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, వెంకట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రేపు అయ్యప్ప స్వామి దేవస్థానం వార్షికోత్సవం

వేమూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వేమూరులో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి వారి దేవస్థానం 11వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీమణికంఠ భక్త బృందం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం గణపతి పూజ మహాన్యాస పారాయణ, పంచసూక్తాల పారాయణతో మూలవిరాట్‌కి పవిత్ర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతిఒక్కరూ దైవచింతనతో మెలగాలి : అనగాని శివప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతనతో ముందుకెళితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం చెరుకుపల్లి మండలం కావూరులో శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం 3వ వార్షికోత్సవంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గ్రామస్థుల సమష్టి కృషితో కోట్లాది రూపాయలు వెచ్చించి గుడి నిర్మాణం చేసి రామలింగేశ్వరస్వామి విశిష్టతను మరింత పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రామకృష్ణ, తుమ్మల సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం 3వేలమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనగాని శివప్రసాద్

వైభవంగా పబ్లిక్ స్కూల్ వార్షిక వేడుకలు

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పబ్లిక్ స్కూల్ 38వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వీఎస్ రఘురాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యతోపాటు సాంస్కృతిక, వైజ్ఞానిక, క్రీడాపరమైన విషయాల్లో విద్యార్థులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, కె.వెంకట్రావు, పి.చంద్రశేఖర్, డి.వెంకయ్యచౌదరి, కె.వీరబ్రహ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియాపై తాత్సారం

(5వ పేజీ తరువాయి)

అందరిలోనూ వ్యక్తమవుతోంది. అధికారుల తాత్సారంతో రేషన్ మాఫియా వ్యవస్థీకృతం వైపు అడుగులేస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. ఇన్ని రోజులూ అక్రమార్జనకే పరిమితమైన దందా ఇప్పుడు కక్షలు, కార్పణ్యాల వరకు వెళ్లడం భవిష్యత్తులో ఈ మాఫియా వల్ల ఇంకెన్ని అనర్థాలను చూడాల్సి వస్తోందననే ఆందోళన జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది. వీరయ్యచౌదరి హత్య నేపథ్యంలోనైనా ప్రభుత్వం మేల్కొని రేషన్ మాఫియాను కూకటి వేళ్లతో పెకిలించేలా చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో జరగబోయే అనర్థాలకు పాలకుల ఉదాసీనతే కారణమవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రతీ నియోజకవర్గంలోనూ బియ్యం దందా

రేషన్ మాఫియా ద్వారా నెలకు జిల్లాలో అక్రమార్జన రూ.3 కోట్లుపై మాటే. ప్రతి నియోజకవర్గంలోనూ ఈ తంతు కానసాగుతూనే ఉంది. నియోజకవర్గాల వారీగా దందా నిర్వహిస్తున్నదెవరు? ఎంతెంత ముడుపులు ఎవరెవరికి అందుతున్నాయి.. అనే అంశంతో పాటు నేతల జోక్యంపై కూడా అధికారుల వద్ద సమాచారం ఉంది. కానీ కట్టడి చేసే సాహసం మాత్రం చేయడం లేదు. పొరుగు జిల్లాకు చెందిన వ్యక్తి ఏకంగా చీరాలలో పాట పెట్టి మరీ రేషన్ దందాను బహిరంగంగా హస్తగతం చేసుకున్నాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక బాపట్లలో ప్రాంతాల వారీగా విభజించుకుని మరీ ఈ దందా సాగిస్తున్నారు.

ఎవరూ ఏమీ చేయలేరని తెంపరితనం


జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో రేషన్ దందా చేసే వ్యక్తులు వ్యవస్థలంటే లెక్కలేని విధంగా వ్యవహరిస్తున్నారు. తనిఖీలకు వెళ్లిన అధికారులపై దాదాపు దాడి చేసినంత పని ఈ మాఫియా చేసిందంటే వారి తెంపరితనం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. నిజాంపట్నం మండలపరిధిలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అక్కడకు వెళ్లిన అధికారులకు వాటిని అక్కడ నుంచి తరలించడం వీలుకాలేదంటే మాఫియా బరితెగింపు ఏ స్థాయిలో ఉందో విశదమవుతోంది. అద్దంకి నియోజకవర్గపరిధిలోని ఓ గ్రామంలో ఏకంగా అధికారుల వాహనాలకు అడ్డు నిలబడి మరీ తనిఖీలను నిలువరించగలిగారంటే ఎవరి దన్నుతో ఇలా చేస్తున్నారనేది తేలాల్సి ఉంది. బహిరంగంగానే అధికార పార్టీ నేతల పేర్లను రేషన్ మాఫియా యథేచ్ఛగా వాడేస్తోంది. ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నది అధికారపార్టీలోని ద్వితీయశ్రేణి నేతాగణమేనని తెలుస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో రేషన్ మాఫియాకు సంబంధించి కీలక నేతల పేర్లు ప్రచారంలో ఉంటున్నప్పటికీ దానిని కట్టడి చేసే విషయంలో సదరు నేతాగణం కూడా మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రేషన్ మాఫియా లెక్కల ప్రకారం నియోజకవర్గానికి నెలకు రూ.25 లక్షలు ముడుపులు నేతలకు ఇస్తున్నామని చెప్పడం కొసమెరుపు.

6ఏ కేసులా.. అవి మమ్మల్నేం చేస్తాయి

బియ్యం దొంగలపై గడచిన పది నెలల్లో జిల్లా వ్యాప్తంగా 125 వరకు 6ఏ కేసులను అధికారులు పెట్టారు. ఇవేవీ ఆ మాఫియాకు అడ్డుకట్ట వేయడంలేదు. 6ఏ కేసులంటేనే ఓ మొక్కుబడి తంతుగా మారింది తప్ప వాటి వల్ల దందాలో ఉన్న వ్యక్తులు వెనకడుగు వేస్తారనుకోవడం నిరూపితమవుతూనే ఉంది. 6ఏ కేసులో ఓసారి పట్టుబడిన వ్యక్తే మళ్లీమళ్లీ అవే కేసులు నమోదవుతుంటాయి తప్ప దందా నుంచి తప్పుకోరు. ప్రభుత్వం అమలు చేస్తానన్న పీడీ యాక్టు అస్త్రం ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆచరణలోకి రావడం లేదు

మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యం

● టీడీపీ నేత మురళీకృష్ణ


ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

కొల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుందని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్త సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో కె.నరసింహారావు ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న మైనేని మాట్లాడుతూ నిపుణులైన వారితో 90రోజులు కుట్టు శిక్షణ ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, అనంతరం ధ్రువపత్రాలు అందజేస్తారన్నారు. మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణను సద్వినియోగించుకోవాలని సూచించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, శిక్షణ తరగతుల కో-ఆర్డినేటర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

ముస్లింలు విద్యారంగంలో రాణించాలి


● అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్‌జానీ

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు విద్యారంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్‌జానీ తెలిపారు. గురువారం సాయంత్రం అంజుమన్ మసీదు ప్రాంగణంలో 10 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ముస్లిం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. సభకు రహీంజానీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యనందించి వారి పురోగతికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది బాషా మాట్లాడుతూ ఇదేస్ఫూర్తితో విద్యారంగంలో విశేషంగా రాణించాలన్నారు. అంజుమన్‌కమిటీ ముస్లింలకు చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన షేక్ జహూరా 593 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారన్నారు. అమన్‌ఆలీఖాన్, షేక్.షర్మిల, షేక్.ముస్కాన్, పఠాన్‌లియాఖత్‌ఖాన్, షేక్.షబీనాలను సత్కరించారు. ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు. నిఘంటవులు బహూకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి అబ్దుల్ కరీం, మహ్మద్ అజ్మతుల్లా, మహ్మద్‌రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు

రేపల్లె, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేసవికాలం రద్దీ దృష్ట్యా ప్రజలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్న మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. గురువారం అరవపల్లి మెయిన్ కెనాల్ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు మోటార్ల ద్వారా నీటినితోడే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీటి సామర్థ్యం తగ్గటంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ప్రజలకు నీరు అందించేందుకు మెయిన్ కెనాల్‌కు నీరు తెప్పించి వాటిని మోటార్ల ద్వారా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో నింపుతున్నామన్నారు. తద్వారా వేసవిలో ఎలాంటి ఎద్దడి లేకుండా ప్రజలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు అభినందనలు


జాకబ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో బాపట్ల లయోల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. గుంటూరు జాకబ్ అనే విద్యార్థి 583 మార్కులతో అత్యుత్తమ ప్రతిభను కనబరచగా వి.ప్రదీప్ 542, నాగచైతన్యరెడ్డి 511, గోప్సి మారడోన 500 మార్కులు సాధించాడు ఈ విధంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్కూల్ ఆవరణంలో ప్రిన్సిపాల్ విన్నకోట సాంబశివరావు, ప్రధానోపాధ్యాయిని పి.షకీలా, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చివుకుల శేషశాస్త్రి స్మారక సభను జయప్రదం చేయాలి

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు చివుకుల శేషశాస్త్రి స్మారకసభను జయప్రదం చేయాలని నల్లమడ రైతు సంఘం నాయకులు కారుమంచి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ విషయమై గురువారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 12వ తేదిన బాపట్ల కొత్తబస్టాండ్ శేషశాస్త్రి స్థూపం వద్ద జరుగుతుందన్నారు. కావున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సివిల్స్‌కు నరసరావుపేట యువతి అంబటి యామిని ఎంపిక

తండ్రి ప్రేరణ..తల్లి కష్టం



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణానికి చెందిన, దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి అంబటి యామిని సివిల్స్‌కి ఎంపికైంది. సివిల్స్ చేస్తే దేశానికి సేవలు అందించవచ్చని ప్రేరేపించిన తండ్రి సాంబశివారెడ్డి అనారోగ్యంతో గతించారు. టైలరింగ్‌తో తల్లి వెంకటరమణి కష్టపడి అంబటి యామినిని చదివించింది. ఐదవ తరగతి వరకు పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న సెయింట్‌ఆన్స్ చదివిన యామిని.. ఆరు నుంచి 10వ తరగతి వరకు మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో చదివింది. ఇంటర్మీడియెట్ హెచ్‌ఈజీ(హిస్టరీ, ఎకానామిక్స్, జాగ్రఫీ) గ్రూపు హైదరాబాద్ మెహదీపట్నంలో ఉన్న విజయవర్ధిని జూనియర్ కాలేజ్‌లో పూర్తి చేసింది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని మేరిండా హౌస్ నుంచి జాగ్రాఫీలో హానర్స్ పూర్తి చేశారు. రెండవ ప్రయత్నంలో సివిల్స్‌లో 591 ర్యాంక్ సాధించి ఐఆర్ఎస్‌కు అంబటి యామిని ఎంపికైంది. దీంతో ఆమె ఇంటిలో సంతోషాలు వెల్లివిరిశాయి. పలువురు స్నేహితులు, బంధువులు యామినిని అభినందించారు.

ఐఏఎస్‌కు ఎంపిక కావడమే అసలు లక్ష్యం

అంబటి యామిని మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది, ముగ్గురు స్నేహితులు గ్రూపుగా ఏర్పడి ఐఏఎస్‌కు సిద్ధం అయ్యాయమని తెలిపింది. ఐఆర్ఎస్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రెండవ ప్రయత్నంలో ఎంపిక అయ్యాయనని, ఐఏఎస్‌కు ఎంపిక కావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

అప్పుడు అంతంతమాత్రం.. ఇప్పుడు అత్యంత వేగం

తెనాలిరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే రెండో అతి పెద్ద వైద్యశాలగా పేరుపొందిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి సత్వరం వైద్యం అందించేలా క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భవనానికి శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు ఈ నెలాఖరుకు పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం పనులకు అవసరమైన బిల్లులను మంజూరు చేసింది. కానీ, వైసీపీ ప్రభుత్వం వాటిని సకాలంలో మంజూరు చేయకపోవడంతో పనులు అంతంతమాత్రంగా సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి బిల్లులను సకాలంలో విడుదల చేసింది. పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలవాలన్న ఉద్దేశంతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నత్తనడకన సాగుతున్న క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టి.. పనులు వేగవంతం చేయించింది. వైసీపీ హయాంలో గ్రావెల్ మాఫియా రాజ్యమేలిన నేపథ్యంలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు మాత్రం అవసరమైన మట్టిని సమకూర్చలేకపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం.. గత ప్రభుత్వ తప్పిదాలను పునరావృతం కాకుండా గ్రావెల్ తవ్వకాలను పూర్తిగా నిలుపుదల చేసింది. దీంతో మట్టికి బదులు ఇసుకతో లెవలింగ్ చేసి పనులు మరింత నాణ్యతా ప్రమాణాలతో ముందుకు సాగిస్తోంది. 2027 నాటికి క్రిటికల్ కేర్ యూనిట్ సేవలందించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది.

వైద్య సేవలు ఇలా..

తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పరిసర ప్రాంతాల ప్రజలేకాక వేమూరు, అమృతలూరు, కొల్లూరు, రేపల్లె, చుండూరు, కొల్లిపర, దుగ్గిరాల, చేబ్రోలు పలు మండలాల ప్రజలు వైద్య కోసం వస్తుంటారు. అయితే ఇక్కడ క్రిటికల్ కండిషన్‌లో ఉన్న రోగులకు తక్షణ వైద్యం అందించే అవకాశంలేదు. రోగికి ఆక్సిజన్ తక్కువ స్థాయికి పడిపోతే గుంటూరు సమగ్ర వైద్యశాలకు రిఫర్ చేస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, రోగులకు అన్ని రకాల వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ఇక్కడ 100 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించేలా కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేసింది. గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా నాలుగు ఫ్లోర్లతో దీనిని నిర్మించేందుకు రూ.45 కోట్లు వెచ్చించింది. ఈ నిధుల నుంచి రూ.22 కోట్లు భవన నిర్మాణానికి కేటాయించగా.. మిగిలిన నిధులను ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీల్లో వస్తువుల కొనుగోలు, వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) విభాగానికి 20 పడకలతో చిన్న పిల్లలకు అవసరమైన నాలుగు సపరేట్ బెడ్‌లతో ఏర్పాటు చేయనున్నారు. హైడిపెనిషిన్ యూనిట్(హెచ్‌డీయూ) 20 పడకలు, ఐసోలేషన్ వార్డు 30 పడకలు, ఐసోలేషన్ గదులు 12, డయాలసిస్ బెడ్‌లు 4, బాలింతలకు (ఎంసీహెచ్) 4 బెడ్‌లు అత్యవసర విభాగం 10 బెడ్లుగా ఏర్పాటు చేయనున్నారు. ఇవి కాకుండా మూడవ అంతస్తులో రెండు ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే క్రిటికల్ కండిషన్‌లో వచ్చే రోగులను జీజీహెచ్‌కు రిఫర్ చేసే అవకాశం తగ్గడంతో పాటు.. తక్షణ వైద్యం అందించి ప్రాణాలు నిలబెట్టవచ్చు.

తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో క్రిటికల్ కేర్ యూనిట్



తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం

- మూడు అంతస్తుల్లో సేవలందించేలా భవన నిర్మాణం
- రూ.45 కోట్లలో రూ.22 కోట్లతో భవనం, మౌలిక వసతుల కల్పన
- ఈ ఏడాది ప్రారంభం లక్ష్యం.. బిల్లుల జాప్యంతో నత్తనడకన పనులు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి.. 2027నాటికి సేవలు



పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



ఉప ముఖ్యమంత్రిని ఆకర్షించిన..

జిందాల్ ప్లాంట్ నమూన

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జిందాల్ సంస్థ నిర్వహిస్తున్న వేస్టు టూ ఎనర్జీ ప్లాంట్ నమూన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని విశేషంగా ఆకట్టుకుంది.. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ స్టాల్‌ని ఏర్పాటు చేశారు. అందులో జిందాల్ సంస్థ తన ప్లాంట్ నమూనాని ప్రదర్శనకు ఉంచింది. డిప్యూటీ సీఎంతో పాటు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈ ప్రదర్శనని తిలకించారు. ఈ సందర్భంగా జిందాల్ సంస్థ ప్రతినిధి చెత్త నుంచి విద్యుత్‌ని ఎలా ఉత్పత్తి చేసేది డిప్యూటీ సీఎంకు వివరించారు. దాదాపుగా మూడు కార్పొరేషన్లు, ఐదు మునిసిపాలిటీలు, చుట్టుపక్కల గ్రామాల్లో నిత్యం ఉత్పత్తి అవుతున్న చెత్తని ఇక్కడికి తీసుకొచ్చి విద్యుత్ ఉత్పాదన చేయడం జరుగుతోందని నివేదించారు. 1,200 టన్నుల చెత్త నుంచి గంటకు 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. అధునాతన యూరప్ సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నామని, ప్రత్యక్షంగా 200 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విద్యుత్ గ్రిడ్‌కు ఈ ప్లాంట్‌ని అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇంకెన్ని ప్రాంతాల్లో ఇలాంటి ప్లాంట్లు ఉన్నాయని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వాకబు చేశారు.

టుబాకో బోర్డు చట్టంలో సవరణలు

గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర వాణిజ్య శాఖ

గుంటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు చట్టం నిబంధనలు- 1976లో కేంద్ర వాణిజ్య శాఖ కొన్ని సవరణలు తీసుకొచ్చింది. ఈ మేరకు అధికారిక గజిట్ నోటిఫికేషన్‌ని విడుదల చేసింది. ఈ నిబంధనలను టుబాకో బోర్డు(సవరణ) రూల్స్ 2025గా నిర్ధయించింది. కాగా టుబాకో బోర్డు రూల్స్ 1976లో రూల్ 33, సబ్ రూల్స్(5), (6), (7)కు సవరణలను చేసింది. (5) సెక్షన్ 10 కింద మంజూరు చేసిన ప్రతి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఫారం-2లో ఉండాలి. అలాంటి సర్టిఫికేట్‌లో పేర్కొన్న మూడు సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌కు సర్టిఫికేట్ చెల్లుబాటు అవుతుంది. (6) రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పునరుద్ధరణ మూడేళ్ల బ్లాక్ పీరియడ్ కోసం ఆమోదించబడుతుంది. (7) రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రతి సర్టిఫికేట్/రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కేవలం మంజూరు చేయబడిన బ్లాక్ వ్యవధికి మాత్రమే చెల్లుబాటు అవుతుంది. (8) సబ్ రూల్(4) కింద నిర్దేశించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కింద కవర్ చేసిన ప్రాంతం కోసం చెల్లించాల్సిన ఫీజు, రిజిస్ట్రేషన్/రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కోసం నియమం 33ఏ సబ్ రూల్(2) కింద ఏర్పాటైన కమిటీ ద్వారా నిర్దేశించబడిన ప్రమాణాల ప్రకారం ఉండాలి. పేర్కొన్న నియమాల్లో నిబంధన 34ఎన్‌లో ఉప నిబంధనలు (2), (3) కోసం బ్యారన్ నిర్వహణ నిమిత్తం పొందిన లైసెన్సు మూడేళ్ల ప్రతి బ్లాక్ కాలానికి పునరుద్ధరించబడాలి. అలా పునరుద్ధరించకపోతే అది మంజూరు చేసిన మూడేళ్ల బ్లాక్ వ్యవధి ముగిసే సమయానికి చెల్లుబాటులో ఉండదు. అలాంటి పునరుద్ధరణ కోసం దరఖాస్తుని తాజాగా అప్లికేషన్ కోసం చేసిన విధంగానే ప్రాసెస్ చేస్తారు. లైసెన్సు /బ్యారన్ నిర్వహణ నిమిత్తం లైసెన్సు పునరుద్ధరణ కోసం ప్రతి దరఖాస్తు ఫాం 25లో ఉండాలి. అందులో పేర్కొన్న వివరాలను కలిగి ఉండాలి. ప్రతి బ్యారన్‌కు సంవత్సరానికి రూ. 10 రుసుము కూడా చెల్లించాలి. గతంలో లైసెన్సు ఏడాదికి పరిమితం అయ్యేది. ఇప్పుడు దానిని బ్లాక్ పీరియడ్ వరకు అమలులో ఉండేలా సవరించారు. ఫాం 25, ఐటెం నంబరు 9కి సంబంధించి దరఖాస్తుదారుడు రిజిష్టర్డ్ వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుడు అయిన పక్షంలో రిజిస్ట్రేషన్ నంబరు, తేదీ, బ్లాక్ పీరియడ్‌ని పేర్కొనాల్సి ఉంటుంది. పొగాకు బోర్డు చట్టంలో చేసిన సవరణలు గజిట్ ప్రచురించిన రోజు నుంచే అమలులోకి వస్తాయని కేంద్ర వాణిజ్య శాఖ పేర్కొంది.

రాజధాని సభకు 1.20 లక్షల మంది



- మే 2న రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభ
- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి జనం రాక
- ప్రధాని మోదీ రోడ్డు షోకు హాజరుకానున్న 30 వేల మంది
- సభ ప్రాంగణంలోని గ్యాలరీలకు తరలిరానున్న మరో 90 వేల మంది
- 2,400 బస్సుల్లో ఏడు రూట్లలో సభ వద్దకు చేరనున్న ప్రజలు

విజయవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి 1.20 లక్షల మంది రానున్నట్లు సమాచారం. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వీరు తరలివస్తున్నట్లు తెలిసింది. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 30 వేల మంది చొప్పున, కృష్ణా, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి 10 వేల మంది చొప్పున వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన సభా ప్రాంగణం 28 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ప్రధాన వేదికలు పోను గ్యాలరీలను 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సభలో సీటింగ్ 50 వేల వరకు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే వారు, వెళ్లే వారు ఉంటారు కాబట్టి మొత్తంగా 1.20 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. వీరిలో 30 వేల మంది ప్రధాని రోడ్డు షోకు వెళ్తారని సమాచారం. మే 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

2,400 బస్సులు ఏర్పాటు

రాజధాని సభకు వచ్చే వారికి ప్రభుత్వం 2,400 బస్సులను ఏర్పాటు చేయనుంది. గుంటూరు నుంచి 600, ఎన్టీఆర్ జిల్లా నుంచి 600, పల్నాడు జిల్లా నుంచి 600, కృష్ణాజిల్లా నుంచి 200, బాపట్ల జిల్లా నుంచి 200, ఏలూరు జిల్లా నుంచి 200 బస్సుల్లో ప్రజలు సభా ప్రాంగణానికి తరలిరానున్నారు.

ఆరు రూట్లలో సభ వద్దకు

గుంటూరు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నంబర్-4లో 200 బస్సుల ద్వారా మంగళగిరి, డాన్ బాస్కో, ఎర్రబాలెం, ఈ 8, ఈ 9 రోడ్ల మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు చేరుకుంటారు. రూట్ నంబర్-5లో 200 బస్సుల ద్వారా ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు తరలివస్తారు. రూట్ నంబర్-6లో మరో 200 బస్సుల్లో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నంబర్ - 1 ద్వారా 600 బస్సుల్లో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం సర్వీసు రోడ్డు, మందడం, ఎన్- 7 రోడ్డు, ఈ 8 జంక్షన్, ఈ 8, ఎన్ 8 రోడ్ల మీదుగా పార్కింగ్-6 ప్లేస్‌కు తరలివస్తారు. పల్నాడు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నంబర్-6 ద్వారా 400 బస్సులలో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. మరో 200 బస్సుల్లో రూట్ నెంబర్-7 ద్వారా అమరావతి, బోరుపాలెం, రాయపూడి, హైకోర్టు రోడ్డు మీదుగా ఈ 6, ఎన్ - 10 రోడ్డు మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు తరలివస్తారు. కృష్ణా జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నంబర్-3, 4 ద్వారా 200 బస్సుల్లో కనకదుర్గా వారధి, ఓటీజీ, ప్రూకా బ్రిడ్జి, నులకపేట, డాన్ బాస్కో, యర్రబాలెం, ఈ 8, ఎన్ 9 జంక్షన్ల మీదుగా పార్కింగ్ - 7 ప్లేస్‌కు వెళ్తారు. బాపట్ల జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నంబర్ - 5 ద్వారా ఎన్‌హెచ్ - 16, వెస్ట్ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు జంక్షన్ మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు వస్తారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నంబర్ - 1 ద్వారా 200 బస్సుల్లో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం, సర్వీసు రోడ్డు, మందడం, ఎన్-7 రోడ్డు, ఈ - 8 రోడ్డు మీదుగా పార్కింగ్ - 6 ప్లేస్‌కు వెళ్తారు.

గ్యాలరీలకు జనం ఇలా..

ఆరు రూట్లలో పార్కింగ్ ప్లేసులకు చేరుకున్న వారంతా కూడా తమకు నిర్దేశించిన విధంగా కొందరు రోడ్డు షోలో పాల్గొనడానికి, మరికొందరు గ్యాలరీలలో కూర్చోవడానికి వెళ్తారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది పూర్తిగా గ్యాలరీలలోనే కూర్చుంటారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే 30 వేల మందిలో 5 వేల మంది రోడ్డుషో, 25 వేల మంది గ్యాలరీలకు వెళ్తారు. పల్నాడు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది కూడా గ్యాలరీలలోనే కూర్చుంటారు. కృష్ణా, బాపట్ల జిల్లాల నుంచి వచ్చే 20 వేల మంది కేవలం రోడ్డు షోకు మాత్రమే వెళ్తారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మందిలో 5 వేల మంది రోడ్డు షోకు, మరో ఐదు వేల మంది గ్యాలరీలలోకి వెళ్తారని సమాచారం.

పీఎం రోడ్డు షోకు 30 వేల మంది

ప్రధాని నరేంద్ర మోదీ దిగే హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు 15 నిమిషాల పాటు జరిగే రోడ్డు షోకు మొత్తం 30 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 5 వేలు, కృష్ణాజిల్లా నుంచి 10 వేలు, బాపట్ల జిల్లా నుంచి 10 వేలు, ఏలూరు జిల్లా నుంచి 5 వేల మంది తరలివస్తారని ఆయా జిల్లాల యంత్రాంగాలు అంచనా వేస్తున్నాయి.

ప్రకాశం బ్యారేజీ మీదుగా వీఐపీ రూట్

సభా ప్రాంగణానికి వెళ్లేందుకు వీఐపీ రూట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వీఐపీ రూట్ విజయవాడలో ప్రకాశం బ్యారేజీ, కరకట్ట, వెంకటపాలెం, సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ఈ - 3, ఎన్ 9 జంక్షన్ నుంచి ఎడమవైపుగా ఈ-6, ఎన్ 9 జంక్షన్‌ను టచ్ చేస్తూ సచివాలయం పక్క నుంచి నేరుగా పీ-9 పార్కింగ్ ప్లేస్‌కు వాహనాలు వెళ్తాయి. ఒకవేళ అవాంతరాలు ఏమైనా ఏర్పడితే వీఐపీ ఆల్టర్‌నేటివ్ రూట్‌ను కూడా నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి జంక్షన్, ఉండవల్లి రోడ్డు మీదుగా వెంకటపాలెం వెళ్లేలా ప్లాన్ చేశారు.

జీతాలు పెరిగినాయీ

- ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు జీతాల పెంపు
- ఏకంగా రూ.25 వేలు చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 7 ఆలయాల్లో 45 మందికి వర్తింపు
- ఆనందం వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి జీతాలను పెంచుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ స్పెషల్ సెక్రటరీ జి.జయలక్ష్మి జీవో ఎంఎస్ నంబర్ 130 జారీ చేసింది. దీంతో పలు ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు ఆనందం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 7 ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు ఇప్పటి వరకు ప్రభుత్వం నెలకు రూ.20 వేలు జీతం చెల్లిస్తుండగా.. ఇక నుండి రూ.25 వేలు ఇవ్వనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం, అమరావతి అమరలింగేశ్వర స్వామి దేవస్థానం, పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం, తెనాలిలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం, అడిగొప్పలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం, మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, కంఠమరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి దేవస్థానంలో పనిచేస్తున్న 45 మంది నాయీ బ్రాహ్మణులందరికీ పెరిగిన జీతాలు వర్తించనున్నాయి. ప్రతి ఆలయంలో ఐదు నుంచి ఏడుగురు నాయి బ్రాహ్మణులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వీరికి తలనీలాలు సమర్పించే భక్తులు తీసుకున్న టోకెన్‌లలో సగం డబ్బులు వచ్చేవి. ఆ తర్వాత పూర్తి డబ్బులను వారికి అప్పజెప్పారు. జీతాలు చాలడం లేదని నాయీ బ్రాహ్మణులు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రాలు అందజేశారు. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తల నీలాల టోకెన్లతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క నాయీ బ్రాహ్మణుడికి నెలకు రూ.25 వేలు చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం



ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నేను పనిచేస్తున్నాను. రూ.25 వేల జీతం చెల్లించడం ఆనందంగా ఉంది. గతంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ఆ ఇబ్బందులు అధిగమిస్తాం.

- మున్నంగి శివ నాగేశ్వరరావు

ప్రత్యేక ధన్యవాదాలు

పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పనిచేస్తున్నాను. ప్రభుత్వం జీతాలు పెంచడం ద్వారా మా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఈ దిశగా చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు.



- ఎం.పిచ్చయ్య



దేవస్థానం అధికారులు, పూజారులతో మంత్రి గొట్టిపాటి

లోపాలు లేకుండా మహాకుంభాభిషేకం

● ఏర్పాట్లపై మంత్రి గొట్టిపాటి
● ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచన

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహా కుంభాభిషేకం ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణ పనులు పూర్తయిన తరువాత మే 19న నిర్వహించే మహాకుంభాభిషేకం ఏర్పాట్లపై గురువారం ఉదయం తాడేపల్లిలోని మంత్రి నివాసంలో దేవస్థానం అధికారులు, పూజారులతో మంత్రి రవికుమార్ చర్చించారు. మహాకుంభాభిషేకానికి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రశాంతంగా స్వామి వారి దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహాకుంభాభిషేకం నిర్వహణకు శృంగేరి పీఠాధిపతి, శిష్య బృందం వస్తున్నందున ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం తదితర కార్య క్రమాల నిర్వహణకు టీటీడీ కల్యాణ మండపాన్ని రీమోడల్ చేయిస్తున్నట్లు మంత్రికి ఈవో తిమ్మానాయుడు వివరించారు. అదే సమయంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల బసకు ఇబ్బంది లేకుండా అన్ని సామాజిక అన్నదాన సత్రాలలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి చెప్పినట్లు మంత్రి రవికుమార్‌కు ఈవో తెలిపారు. సమావేశంలో ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, ఆచార్యులు, కిషోర్ పాల్గొన్నారు.



వీరన్నపాలెంలో రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

● కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య

పర్చూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) :నల్లబర్లీ పొగాకుకు రూ.18వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం రైతుసంఘం నాయకులు పర్చూరు మండలంలో పర్యటించి పొగాకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను వెంటనే రంగలోకి దించి నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో వీరన్నపాలెం, పోతుకట్ల, రమణాయపాలెం, ఉప్పుటూరు గ్రామాల్లో నాయకులు పర్యటించారు. వీరన్నపాలెంలో 300 మంది కౌలు రైతులు సగటున 5 ఎకరాల చొప్పున 1500 ఎకరాల్లో నల్లబర్లీని సాగుచేశారన్నారు. సమస్యలపై వచ్చేనెల 5న సీఎం కార్యాలయానికి రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో మంత్రి కొల్లు వినతిపత్రం అందజేస్తున్న గ్రానైట్ పరిశ్రమల యజమానులు

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి

● మంత్రి కొల్లుకు యజమానుల వినతి

మార్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ పరిశ్రమలను ఆదుకోవాలని మార్టూరు గ్రానైట్ పరిశ్రమల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సమక్షంలో గురువారం విజయవాడలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందచేశారు. గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని, ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమ పురోగతికి సహకరించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా మార్టూరు గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ తీరు, ఇబ్బందులను ఎమ్మెల్యే ఏలూరి మంత్రి కొల్లు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వపరంగా సహకారం అందిస్తే గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని కోరారు. కార్యక్రమంలో మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ఇంటూరి ఆంజనేయులు, దివ్వె ప్రసాద్, కోటపాటి సురేష్, కామినేని జనార్దన్, షేక్ రజాక్, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో వసతులు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళి

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వైప ప్రభుత్వ కళాశాలలో వసతులు పెంచి విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ డా.ఎన్ మురళి పేర్కొన్నారు. కళాశాలలో గురువారం కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా 2025-26 విద్యా సంవత్సరం ప్రణాళిక, అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్ రవికుమార్‌రెడ్డి, డా.ఐ.బాబూరావు, మురళీకృష్ణ, బ్రహ్మారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోశాలకు 12 బస్తాల తవుడు అందజేత

అద్దంకిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో హరి హర గోకులానికి దాతల సహకారంతో తౌడు బస్తాలను అందజేసినట్లు అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. గురువారం పట్టణంలో హరిహర గోశాలకు దామ జగదీష్ కుమార్తె ధాత్రిశ్రీ పుట్టిన రోజు సందర్భంగా 8 బస్తాలు, చెన్నుపల్లి అంజయ్య 2 బస్తాలు, చెన్నుపల్లి సుబ్బారావు 2 బస్తాల తౌడును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చైర్మన్ పీఠం దక్కేదెవరికో..?

సమయమిచ్చినా చేతులెత్తేసిన జంజనం

అనివార్యమైన అవిశ్వాసం

ఆ స్థానం కోసం అశావాహుల ప్రయత్నాలు

ఈ విషయంపై గోప్యత పాటిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై కౌన్సిలర్‌లు అవిశ్వాసం ప్రకటించారు. అందుకు సంబంధించిన తీర్మాన కాపీని బుధవారం కలెక్టర్ వెంకట మురళికి అందజేశారు. అయితే అవిశ్వాస అంశానికి దాదాపు రెండు మాసాల నుంచి ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై మొదటి నుంచీ ఎమ్మెల్యే కొండయ్య లాభ నష్టాలను బేరీజు చేసుకుంటూ వస్తున్నారు. కలిసి ఉంటే కలదు సుఖం అన్నట్లుగా చాలా సమయం మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు అవకాశం ఇచ్చినట్లయింది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ, అభివృద్ధి పనులను కలిసే నిర్వహించారు. అయితే కొన్ని రాజకీయ సమీకరణాలు, మరోవైపు చైర్మన్ దోబూచులాట, చైర్మన్ చాంబర్‌ను వైసీపీ కార్యాలయంగా మార్చి అక్కడే సమావేశాలు నిర్వహిస్తుండడంతో అంగీకరించని టీడీపీ కౌన్సిలర్‌లు ఎమ్మెల్యేపై ఒకింత అవిశ్వాసానికి ఒత్తిడి తెచ్చారు. గత నాలుగేళ్లుగా వైసీపీ నుంచి చైర్మన్ స్థానంలో అధికారం చేపట్టిన జంజనంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్లు కన్పిస్తుంది. మరోవైపు ఆయన సామాజికవర్గం కౌన్సిలర్‌లు సైతం చైర్మన్‌పై లోలోపల గుర్రుగానే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పలుమార్లు ఎమ్మెల్యే కొండయ్య సున్నితంగా హెచ్చరించినా చైర్మన్ తీరు మారలేదు. దీంతో అవిశ్వాసానికి సై అన్నారు.

స్థానిక సంస్థలకు కలిసొచ్చే అంశం

చీరాలకు మునిసిపాలిటీ వెన్నెముక లాంటిది. అనేక అభివృద్ధి, ఆదాయ పనులన్నింటిలోనూ కొన్ని రాజకీయ సమీకరణాలకు ముడిపడి ఉంటుంది. మునిసిపాలిటీ మొత్తంగా సుమారు లక్ష ఓట్లు ఉన్నాయి. వైసీపీ హయాంలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీకి చేదు అనుభవం మిగిలినా తాజా పరిస్థితులు ఆపార్టీకి కలిసిరానున్నాయి. దీంతో అవిశ్వాసం రూపంలో చైర్మన్ పీఠంపై త్వరలో టీడీపీ జెండా ఎగరనుంది. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీకి అవిశ్వాసం కలిసిరానుంది.



పాపికొండలు విహారయాత్రలో కుటుంబసభ్యులతో చీరాల కౌన్సిలర్లు

చైర్మన్ ఎవరన్నదానిపై గోప్యత

అవిశ్వాసంపై అధికారులు ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించారు. అయితే చైర్మన్ స్థానంపై పలుమార్లు ఆశించి భంగపడిన పొత్తూరి సుబ్బయ్య, మించాల సాంబశివరావు ఈసారి గట్టిగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే గతంలోనూ ప్రయత్నాలు సాగించి విఫలమైన సూరగాని లక్ష్మి అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో చైర్మన్ ఎవరన్నదానిపై చర్చ వాడీవేడీగా ఉంది. అయితే ఎమ్మెల్యే కొండయ్య మాత్రం దీనిపై చాలా గోప్యత పాటిస్తున్నారు. ఈ విషయంలో అనుభవంతో తనదైన మార్కుతో ముందుకు సాగుతున్నారు. అయితే ఈ ఉత్కంఠకు మరికొద్ది రోజుల్లోనే తెరపడనుంది.

హంతక ముఠాలపై ప్రత్యేక నిఘా

రెండు కోణాలలో దర్యాప్తు

మంచి రాజకీయ భవిష్యత్ దశలో ప్రాణాలు కోల్పోయిన వీరయ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటు రాజకీయంగా అటు వ్యాపారపరంగానూ ఉజ్వల భవిష్యత్‌కు దగ్గరైన యువ నాయకుడు వీరయ్యచౌదరి హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అందులోనూ పూర్వం ఒంగోలులో జరిగిన హత్యలను గుర్తుకు తెచ్చే విధంగా సాయంత్రం 7.30 సమయంలోనే హంతకులు నిమిషాల వ్యవధిలో హత్యచేసి నింపాదిగా పరారు కావడం యావత్ ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటన పోలీస్ నిఘా విభాగంలోని డొల్లతనాన్ని తేటతెల్లం చేసింది. హత్య జరిగిన తీరుతెన్నులను పరిశీలిస్తే హంతకులు ఆరితేరిన నేరస్తులుగా తేటతెల్లం అవుతుంది. హతుడు బతికే అవకాశం లేకుండా కత్తితో పొడవడం అందులోనూ శరీరంలో ప్రాణాలను తీసే భాగాలలో కత్తితో పొడిచిన తీరు అందుకు దర్పణం పడుతుంది. పూర్తిస్థాయిలో రెక్కీ నిర్వహించుకునే దుండగులు హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. వీరయ్య నగరంలో ఉంటే సాయంత్రం 7 గంటలకు కార్యాలయానికి చేరే అలవాటు ఉంది. ఆ తర్వాత 8 గంటల సమయానికే అతని వద్ద పనిచేసే ఉద్యోగులు, కలెక్షన్ బాయ్‌లు అక్కడికి చేరుతుంటారు. వీరయ్యను కలిసే రాజకీయ శ్రేణులు కూడా ఆ సమయానికి అక్కడకు చేరడం నిత్యం జరిగే ప్రక్రియ. ఈలోపు వీరయ్య ఫోన్‌లో ఇటు రాజకీయ అటు వ్యాపారపరమైన అంశాలపై మాట్లాడుకుంటూ ఉండటం ఆఫీసులో ఉండే అకౌంటెంట్‌తో మాట్లాడుతుండం తెలిసిందే. తద్వారా వీరయ్య కార్యాలయానికి చేరిన తొలి అరగంటలో అతని వద్ద పెద్దగా ఉద్యోగులు, అనుచరులు ఉండరనే విషయం హంతక బృందం ముందుగానే పసిగట్టినట్లు వెల్లడవుతుంది. దీనికి తోడు పూర్తి జనసంచార ప్రాంతం కావడంతో నిమిషాలలోనే తమ పని ముగించుకునే విధంగా హంతకులు పథకం రూపొందించుకోగలిగారు. తదనుగుణంగానే వారు వీరయ్య గదిలోకి వెళ్లడం అక్కడ ఉన్న ఇద్దరు సిబ్బంది మెడపై కత్తులు పెట్టడం హడావుడిగా వీరయ్య లేవగానే ఒకరు బలమైన ఆయుధంతో అతని మెడ మీద ఆ వెంటనే గుండె మీద అ వెంటనే పొట్టపై పొడవడం క్షణాలలో జరిగిపోయింది. వీరయ్యకు బతికే అవకాశం ఇవ్వకూడదనే ఆలోచన, ఖచ్చితత్వాన్ని హంతకులు ప్రదర్శించారు. అందుకు మనిషికి ఆయువు పట్టుగా ఉన్న వాటిపై పొడవడంతోపాటు శరీరంలో మొత్తం 50చోట్ల కత్తితో గాయపర్చారు. అంతా మూడు నుంచి నాలుగు నిమిషాల వ్యవధిలోనే పూర్తిచేశారంటే హంతకులు ఏ స్థాయిలో ముందస్తు రెక్కీ నిర్వహించుకుని పని ముగించారో అర్థమవుతుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే దుండగులు హత్యలలో ఆరితేరిన వారనేది ప్రాథమిక దార్యప్తులోనే పోలీసులు కూడా గుర్తించారు. ఆ కోణంలో చూస్తే ముఠా కొద్దిరోజుల ముందుగానే ఒంగోలులోకి ప్రవేశించి వ్యూహం రూపొందించుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హంతకులు ముఖానికి ముసుగులు కూడా ధరించకుండా చేతిబ్యాగులలో కత్తులు పెట్టుకుని పైకి రావడం గమనార్హం. బ్యాగ్‌తో పైకెళ్లడం ద్వారా కింద చూపరులకు అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డారు. ఇదే సమయంలో నగరంలో రౌడీమూకలు, హంతక ముఠాలపై పోలీస్ శాఖ నిత్యం నిఘా ఉండటం సహజంగా జరుగుతుంది. పాత నేరస్తుల కదలికలతోపాటు బయట నుంచి వచ్చి తిరుగుతున్న వారిని పసిగట్టడం నిఘా విభాగం విధులలో ఒక భాగం. ఆ విషయంలోనే పోలీస్ నిఘా విభాగం డొల్లతనం ఈ విషయంలో తేటతెల్లం అవుతుంది.

ద్విముఖ వ్యూహం.. జల్లెడ పట్టిన వైనం

హతుడు వీరయ్యకు స్వగ్రామం అమ్మనబ్రోలులోనూ నాగులుప్పలపాడు మండలంలో రాజకీయంగా విభేదించే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఒకప్పుడు బెంగళూరులో కూడా వీరయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసేవాడు. అయితే అక్కడి వీరయ్య భాగస్వామి కరోనా సమయంలో మృతిచెందడంతో అక్కడ తెగతెంపులు చేసుకుని జిల్లాలోనే వ్యాపారం చేస్తున్నాడు. అయినా బెంగళూరులో వ్యాపార సమయంలో జరిగిన అంశాలను కూడా పోలీసులు పరిగణిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఏడాది క్రితం రామాయపట్నం ఓడరేవు ప్రాంతంలో సుమారు 100 ఎకరాల భూమిని వీరయ్య కొనుగోలు చేసినట్లు పోలీసులు పసిగట్టారు. అందులోనూ కొంత వివాదం ఉండి ఆ వ్యవహారం కోర్టులో ఉన్నట్లు తెలుసుకున్నారు. ఆ అంశం పూర్వాపరాలపైన దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిసింది. వీటికితోడు మండలంలో రాజకీయంగా విభేదిస్తూ వైసీపీ నేతల అండదండలతో ఉన్న రేషన్ బియ్యం మాఫియాపైనా పోలీసులు కీలకంగా దర్యాప్తు చేస్తున్నారు. అందులో ఒక కీలక రౌడీషీటర్‌తో పాటు వారికి సంబంధాలు ఉన్నాయని నలుగురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హంతకులు కసిగా వ్యవహరించిన తీరును దృష్టిలో ఉంచుకుని రాజకీయ, ఆర్థిక, మహిళల వ్యవహారాలు ఉండే అవకాశం ఉందన్న అంశాలను పరిశీలిస్తున్నారు. అయితే మహిళలకు సంబంధించిన ఎలాంటి అంశం వీరయ్య జీవితంలో లేదన్న అంశం గుర్తించి వ్యాపార, రాజకీయకోణాల్లోనే దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న క్లూతో.. సరికొత్త దర్యాప్తు

ఈ దశలో ఒక చిన్నపాటి క్లూతో పోలీసులు సరికొత్త దర్యాప్తునకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. అందులో భాగంగానే మరోసారి ఎస్పీ తన బృందంతో ఘటనా స్థలానికి వచ్చి ప్రత్యక్ష సాక్షుల ద్వారా గురువారం సాయంత్రం స్వీయ పరిశీలన చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతలో అటుఇటు సంచరించిన వారిని గుర్తించే ప్రక్రియకు శ్రీకారం పలికారు. సీసీ కెమెరాలలో గుర్తు తెలియని వ్యక్తుల రాకపోకలను కొంతమేర గుర్తించారు. వారిలో కొందరి ముఖ కవళికలు స్పష్టంగా కనిపించగా మరికొందరివి స్పషత లేవని తెలిసింది. దీంతో సాంకేతిక విధానంలో అలాంటి వారిని ముఖాలను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం పలికారు. హంతకులు తెలివిగా సీసీ కెమెరాలు ఎక్కడున్నవి ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకున్నారన్న అంచనాకు కూడా పోలీసులు వచ్చినట్లు తెలిసింది. అయితే హంతకులు వాడిన బైకులు కూడా ఇంతవరకు పోలీసులు గుర్తించలేకపోయారు. దీంతో నేరస్తులను జల్లెడ పట్టే పనికి శ్రీకారం పలికారు. జిల్లాలో, సమీప జిల్లాల్లో నేరస్తులు ప్రత్యేకించి హంతక ముఠాల్లోని సభ్యులను పట్టుకొచ్చి విచారిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడైనా క్లూ చిక్కుతుందన్న విశ్వాసం పోలీసుల్లో ఉంది.

కంటి ముందు ఉజ్వల భవిష్యత్తు

ఒకప్పుడు వీరయ్య వ్యవహారశైలి దూకుడుగా ఉండేది. అనేక చేదు అనుభవాలు, మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సహనం, సయోధ్యతో ముందుకు సాగే విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలోని టీడీపీ ముఖ్య నాయకులతోపాటు లోకేష్ దృష్టిలోనూ నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పేరుపెట్టి పలకరించే పరిస్థితి ఉంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా ఆయన ఎంపికయ్యే అవకాశం కనిపిస్తుంది. ఆ పదవికి పార్టీలో పోటీ ఉన్నప్పటికి లోకేష్ దృష్టిలో ఉన్నందున వీరయ్యను ఆ పదవి వరించబోతుందన్న విషయం ఆ పార్టీ ముఖ్య నాయకులందరిలోనూ ఉంది. ఆ పదవి ద్వారా రాజకీయంగా పార్టీలో మరింత ఎదగాలన్న ఉద్దేశంతో నాయకులందరితో సన్నిహితంగా మెలుగుతున్న సమయంలో హత్యకు గురయ్యారు.

ఏఎంసీ వైస్ చైర్మన్ల ఎంపిక

అద్దంకికి నాగేశ్వరరావు, సంతమాగులూరుకు నరేంద్ర



దేవినేని నరేంద్ర (సంతమాగులూరు)

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి, సంతమాగులూరు మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) వైస్ చైర్మన్‌లు, సభ్యుల పేర్లను ప్రకటించారు. అద్దంకి ఏఎంసీ చైర్మన్‌గా వరగాని పద్మావతిని గతంలోనే ప్రకటించారు. అద్దంకి వైస్ చైర్మన్‌గా ధర్మవరపు నాగేశ్వరరావు, సభ్యులుగా బొప్పూడి భారతి, చింతా వెంకటేశ్వరరెడ్డి, గుంజి రామాంజనేయులు, గుంజి రేణుక, కర్నాటి పూర్ణచంద్రరావు, కొప్పర్తి నాగరాజ, కురిచేటి వెంకటసుబ్బారావు, మద్దుమాల నారయ్య, మేకల అంకమ్మ, మిద్దెబోయిన పాపారావు, పూనాటి పద్మ, రాయపాటి రామాంజమ్మ, యస్‌కె రహిమున్నీని నియమించారు.

సంతమాగులూరు మార్కెట్ కమిటీ ..

సంతమాగులూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తేల ప్రోలు రమేష్‌ను ఇప్పటికే ప్రకటించగా, గురువారం వైస్‌చైర్మన్‌గా దేవినేని నరేంద్ర, సభ్యులుగా బైలడుగు శివయ్య, బొల్లా నాగేశ్వరరావు, గోమరావలి సుభాని, గుంజి అంకమ్మ, జొన్నలగడ్డ లక్ష్మి, కా ట్రగడ్డ వరలక్ష్మి, కొల్లి నాగశేషమ్మ, కుంచపు నాగేశ్వరమ్మ, మేడ రేణుకేశ్వరరావు, మూడావత్ మేరి బాయ్, పెరివేముల అరుణ,పులి అంజమ్మ, తాళ్ల గోవిందమ్మను నియమించారు. సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఓసీలకు కేటాయించడం తో పాటు ఇద్దరు ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం విశేషం. అద్దంకి ఏఎంసీ చైర్మన్‌గా ఎస్సీ సామాజికవర్గానికి కేటాయించగా వైస్ చైర్మన్‌గా కాపు సామాజికవర్గానికి కేటాయించారు.

వలసలు నివారించడమే ప్రభుత్వ లక్ష్యం

● కూలీలతో మమేకమై వారితో పాటు పనిచేసిన సబ్‌కలెక్టర్

మార్కాపురం రూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి). గ్రామీణ ప్రాంతాలలో కూలీల వలసలను నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామ పరిధిలో వెలిగొండ ప్రాజెక్టు కలనూతల-1 పునరావాస కాలనీ వద్ద వెలిగొండ ప్రాజెక్టు కాలువలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను గురువారం సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొంత సమయం కూలీలతో పాటు కాలువలో గొడ్డలి చేతపట్టి పిచ్చి చెట్ల తొలగింపు పనులు, గడ్డపారతో మట్టిని తవ్వడం, పారతో మట్టిని తీసుకుని కాలువపై పోయడం వంటి పనులను చేసి కూలీలలో ఉత్సాహాన్ని నింపారు. కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స సామగ్రి, నీడ వంటి సదుపాయాలు ప్రతి రోజు ఏర్పాటు చేస్తున్నారా..? లేదా.? అని అడిగి తెలుసుకున్నారు.

ఎన్ని రోజులు నుండి పని చేస్తున్నారు. వేతనాలు సక్రమంగా వ్యక్తిగత ఖాతాలలో జమవుతున్నాయా..? లేదా..? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. . గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకం ద్వారా నిర్మించిన పశువుల నీటి తొట్టెను, పశువుల పాకను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో నాగరాజు ఈసీ కిషోర్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి, టీఏ కాశీరావు, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు , పక్కన మృతి చెందిన సోమమ్మ (ఫైల్)

కూలీల ఆటో బోల్తా

● ఒకరు మృతి, పలువురికి గాయాలు

చినగంజాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కూలీల ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదం ఇంకొల్లు, కడవకుదురు ఆర్అండ్‌బీ రహదారిలోని తిమ్మసముద్రం అడ్డరోడ్డు సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. మిరపకాయల కోతకు గురువారం ఉదయాన్నే మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన మహిళా కూలీలు పావులూరుకు ఆటోలో బయలుదేరారు. ఆటో తిమ్మసముద్రం అడ్డరోడ్డు దాటిన తరుతాత హ్యాండిల్ ఒక్కసారిగా బిగుసుకొనిపోయి అదుపు తప్పి ఆర్అండ్‌బీ రహదారి పక్కనున్న పొలాల్లో వెళ్లి బోల్తా పడింది. ఆటోలో ఉన్న 15 మంది మహిళా కూలీలు ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనలో బత్తుల కమలమ్మ, కొండేపి శేషమ్మ, నక్కల సోవమ్మ, ఆటో డ్రైవర్ గొల్లపూడి వెంకటేశ్వర్లులకు తీవ్రగాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని 108లో చీరాల వైద్యశాలకు తరిస్తుండగా మార్గమధ్యంలో నక్కల సోమమ్మ(72) మృతి చెందింది. తలకు తీవ్ర గాయమైన బత్తుల కమలమ్మను ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొండేపి శేషమ్మ, వెంకటేశ్వర్లు చీరాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ శీలం రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు. పరిమితికి మించి అధిక లోడుతో ఆటోలు వెళ్తున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.



ప్రమాదానికి గురైన ప్రయివేటు బస్సు, కింద అపస్మారకస్థితిలో పడి ఉన్న డ్రైవర్ ఫయాజ్

కొండను ఢీ కొన్న ప్రైవేటు బస్సు

● శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఘటన
● డ్రైవర్ పరిస్థితి విషమం ● పలువురికి స్వల్ప గాయాలు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు కొండను ఢీకొన్న ఘటన శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో నల్లమల అటవీ ప్రాంతంలో గురువారం చోటుచేసుకొంది. చిన్నారుట్ల సమీపంలోని మలుపు వద్ద బస్సు వేగం అదుపుతప్పి కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఫయాజ్‌కు తీవ్రగాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి మండలం సిరిగుప్ప గ్రామానికి చెందిన 40 మంది కాశీయాత్రలో భాగంగా శ్రీశైలం వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకొంది. ఈ బస్సు ముందు భాగం దెబ్బ తినగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ కుదుపునకు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. తేరుకున్న యాత్రికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను సున్నిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

ఆటోను ఢీకొన్న లారీ

● మహిళా కూలీలకు గాయాలు

నాగులుప్పలపాడు,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు.ఈ సంఘటన 216 రహదారిపై ఉప్పుగుండూరు సమీపంలో చోటుచేసుకొంది. కూలీలు తెలిపిన వివరాల మేరకు చినగంజాం మండలం రామచంద్రానగర్‌కు చెందిన కూలీలు గురువారం ఉదయం ఆటోలో మిర్చి కోతలకు నాగులుప్పలపాడు వైపు వెళుతున్న క్రమంలో ఉప్పుగుండూరు వద్ద నాగన్నవాగు సమీపంలోకి రాగా చీరాల వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొని ఆగకుండా వెళ్లింది. దాంతో ఆటోలో ఉన్న బల్లి సుబ్బలక్ష్మి, పచ్చంగి సూర నాగమ్మ, దండుపోలు కల్యాణలక్ష్మి,రాసానే జాలమ్మ గాయపడ్డారు. వారిని 108 లో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంకా వైఎస్సార్ పేరే

» విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలపై తొలగించని వైనం » ప్రభుత్వ ఆదేశాల అమలులో నిర్లక్ష్యం



శింగరకొండపాలెంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనంపై ఉన్న వైఎస్సార్ పేరు

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో గత వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం భవనాలను నిర్మించింది. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరులో వైఎస్సార్ పేరును తొలగించి విలేజ్ హెల్త్ క్లినిక్‌గా మార్పు చేశారు. అయితే ఆ మార్పు రికార్డులకే మా త్రమే పరిమితం అ య్యిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలపై ఇంకా వైస్సార్ పేఱను తొలగించకపోవడం ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో వాటి అమలులో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా భవనాలపై పేరు మార్పునకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉగ్ర దాడి అమానుషం

» ఎమ్మెల్యే కొండయ్య
» కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులపై అత్యంత పాశవికంగా ఉగ్ర వాదులు దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. గురువారం రాత్రి టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాదాలు చేశారు. దీంతో చీరాల హోరెత్తింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవత్వాన్ని మరచి క్రూరంగా హత్యకు పాల్పడిన ఘటన యావత్ దేశాన్ని కలచివేసిందన్నారు. ఉగ్రవాదాన్ని అంత మొందించేందుకు దేశరక్షణ విభాగం ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. బాధిత కుటుంబానికి కన్నీటి వీడ్కోలు తెలిపారు. అలాగే కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేత ఆమంచి స్వాములు, టీ డీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హిందు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ అనంతరం పాకిస్థాన్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.

న్యాయవాదుల నిరసన

పర్చూరు : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ పర్చూరు కోర్టు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ మేరకు వారు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు పూరిమెట్ల జాన్‌బాబు కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న విజయలక్ష్మి

సూదివారిపాలెం సర్పంచ్‌కి అవార్డు

ఇంకొల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూదివారి పాలెం గ్రామ సర్పంచ్ గోరంట్ల విజయలక్ష్మి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. గ్రామంలో స్వచ్ఛభారత్, జలజీవన్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఆమె చేసిన కృషిని గుర్తించి శానిటేషన్ లీడర్‌షిప్ అవార్డును అందజేశారు. ఢిల్లీలో సర్పంచ్ సమావాద్ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ చేతుల మీదుగా విజయలక్ష్మి అవార్డును అందుకున్నారు. అలాగే ఇడుపులపాడు గ్రామ సర్పంచ్ సుమతి, జక్కరయ్యకు ఉత్తమ సర్పంచ్ అవార్డు అందజేశారు.

సర్పంచ్ అంజిబాబుకు సేవా పురస్కారం



సర్పంచ్ అంజిబాబుకు పురస్కారాన్ని అందజేస్తున్న నేతలు

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా బల్లికురవ గ్రామ సర్పంచ్ పందిరి అంజిబాబుకు నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వ రాజ్య సాధన సమితి గురువారం ఉమ్మడి జిల్లా ఒంగోలులో సేవా పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా బల్లికురవ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజారంజక పాలన అందిస్తున్న అంజిబాబును ఘనంగా సత్కరించి సేవా పురస్కారం 2024- 2035 ఏడాదికి గాను అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, సర్పంచ్‌ల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రచారి పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవనాలు

పంగులూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐదు గ్రామాలలో కోటీ 50 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవనాల నిర్మాణం చేపట్టినట్లు పీఆర్ ఏఈ హనుమంతరావు తెలిపారు. తూర్పుకొప్పెరపాడు వడ్డెరకాలనీలో రూ.20 లక్షలు, తూర్పుతక్కెళ్లపాడులోని ఎస్సీకాలనీలో రూ.20లక్షలు, కొండమూరు ఎస్సీ కాలనీలో రూ.40లక్షలు, పంగులూరు యాదవ కాలనీలో రూ.20లక్షలు, కొండమంజులూరులో రూ.20లక్షలు, బూదవాడ ధనలక్ష్మి కాలనీలో రూ.30లక్షల సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు ఏఈ హనుమంతరావు తెలిపారు. సామాజిక భవన నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నట్లు తెలిపారు. నూజెళ్లపల్లి ఎస్సీ కాలనీ ప్రజల సౌకర్యార్థం 5 లక్షల సి.ఎస్.ఆర్. నిధులతో బస్ షెల్టర్ నిర్మించనున్నట్లు ఏఈ తెలిపారు.

గ్రంథాలయానికి ఆట వస్తువుల బహూకరణ

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల వినియోగంతో భావిపౌరులుగా ఎదుగుతారని గ్రంథ పాలకురాలు ధనమ్మ అన్నారు. గురువారం శాఖ గ్రంథాలయంలో పల్లపోతు బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు రాధాకృష్ణమూర్తి, శ్యాంప్రసాద్ పలు విలువైన ఆట వస్తువులను బహూకరించారు. ఈ సందర్భంగా వారిని ధనమ్మ అభినందించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పర్చూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 10.30 గంటలకు పర్చూరు మండల కేంద్రంలోని టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం, 11 గంటలకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యాంత్రీకరణ పరికరాల అందజేత, 11.30కి సాకేట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం, మధ్యాహ్నం 12 గంటలకు చిరువ్యాపారులకు నాలుగు చక్రాల బండ్లు పంపిణీ, మధ్నాహ్నం 12.30 గంటలకు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాల పంపిణీ, 12.40కి వెలుగు కార్యాలయంలో పీఎంజీఎస్‌వై నిరుద్యోగ భృతి కింద కెమెరాల పంపిణీ, 12.45కు ప్రసన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం, 12.50కి ఎన్టీఆర్ స్టేడియం పరిశీలన, అనంతరం చినగంజాం మండలం గొనసపూడి గ్రామంలో పర్యటించనున్నట్లు ఏలూరి క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

మండల సమాఖ్య నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కోటేశ్వరరావు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నట్లు ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. అధ్యక్షురాలిగా షేక్ కరిమూన్, ఉపాధ్యక్షురాలిగా పచ్చవ భార్గవి, కార్యదర్శిగా రావూరి దేవి, సహాయ కార్యదర్శిగా కొప్పుల మాలతి, కోశాధికారిగా వెంగళశెట్టి అంజమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తాపడిన ట్రాక్టర్, ట్రాలీ

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ ముట్లూరి సుబ్బయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలం గోపాలపురానికి చెందిన ముట్లూరి సుబ్బయ్యకు సొంత ట్రాక్టర్ ఉంది. గురువారం మధ్యాహ్నం ఇసుక లోడుతో శంఖవరప్పాడు వైపు వెళ్తూ కలవకూరు చెరువు వద్ద మోటార్‌సైకిల్‌ను తప్పించే క్రమంలో షడన్ బ్రేక్ వేయడంతో చెరువు అంచున బోల్తా పడింది. గాయాలైన సుబ్బయ్యను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్, ట్రాలీ చెరువు అంచున బోల్తాపడడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కమిటీ

మార్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పఠాన్ ఖాదర్‌వలి, ఉపాధ్యక్షుడిగా షేక్ బాషా, ప్రధాన కార్యదర్శిగా పుట్టా అయ్యప్పస్వామి, కార్యదర్శిగా షేక్ రహీము, గౌరవ అధ్యక్షుడిగా కన్నెగంటి శ్రీనివాసరావు, ఆంజనేయులు, గౌరవ సలహాదారులుగా జె జయరావు, శ్రీరాం వెంకట్రామయ్యను ఎన్నుకున్నారు.

వసతి గృహానికి మహర్దశ

» వైదన సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో మరమ్మతులు
» రూ.52లక్షల నిధులు విడుదల చేసిన మంత్రి గొట్టిపాటి
» హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



శిథిలావస్థలో ఉన్న వైదన సాంఘిక సంక్షేమ వసతి గృహం



విద్యార్థులు ఉండే గదులలో ఊడిన పైకప్పు



పడిపోయే దశలో ఉన్న వాటిని పగులగొడుతున్న కార్మికులు

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరిన వైదన బాలుర సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసి తిరిగి విద్యార్థులకు ఉపయోగపడే మరమ్మతు పనులు చేయిస్తోంది. మండలం వైదనలో 1984లో ప్రభుత్వం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. వంద మంది విద్యార్థులు ఉండేలా వసతి గృహాన్ని నిర్మించారు. గత కొంత కాలం నుంచి వసతి గృహం పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు వసతి గృహానికి రావాలంటే భయపడుతున్నారు. నాలుగేళ్ల నుంచి విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ఏడాది ఒక్క విద్యార్థి కూడా వసతి గృహంలో చేరకపోవడంతో వసతి గృహం పూర్తిగా మూత పడింది. విద్యార్థులకు రక్షణ లేదని ప్రమాదంగా గదులు ఉన్నాయని తల్లిదండ్రులు వసతి గృహానికి ఎవరిని చేర్చలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైదన గ్రామ యువనేత పోగుల శేఖర్ తదితరులు వసతి గృహం శిథిలావస్థకు చేరి మూత పడిందని మంత్రి రవికుమార్‌కు వివరించారు. వెంటనే మంత్రి రవికుమార్ వసతి గృహ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే పడి పోతున్న గదులను మర్మతులుచేసి పైకప్పు మరలా వేసేలా రూ.52లక్షల నిధులను మంజూరు చేయించారు. 15రోజుల నుంచి వైదన వసతి గృహంలో మరమ్మతు పనులు చకచకా సాగుతున్నాయి. బాగా దెబ్బతిన్న ఎనిమిది గదులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. జూన్‌లో విద్యార్థులతో వసతి గృహం మరలా వినియెగంలోకి తీసుకు వచ్చేలా పనులు చేపడుతున్నారు. అధికారులు కూడా ఇప్పటికే గ్రామాలలో విద్యార్థులను వసతి గృహంలో చేర్చేలా ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు. మూతపడి ఉన్న వసతి గృహాన్ని ప్రభుత్వం మరలా వినియెగంలోకి తీసుకు వచ్చే చర్యలు తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఈ వసతి గృహం ఎంతో ఉపయోగమని వారు తెలిపారు.



మజ్జిగను పంపిణీ చేస్తున్న డీఎస్పీ ఎండీ మొయిన్

ఎండల దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలి

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి తాకిడి అధికంగా ఉందని, చిన్నారులు, వృద్ధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్యలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై పవన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కరెంట్ కట్

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడుతున్నట్లు అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, ఊజిలీపేట ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



ఈవో తిమ్మానాయుడుకు విరాళం అందజేస్తున్న దాతలు

రాతి మండపానికి రూ.1,11,116 విరాళం

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి పట్టణానికి చెందిన పూటుకూరు నాగయ్య, వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రామకోటేశ్వరరావు, మనవళుల నరేంద్ర, కృష్ణకిషోర్ రూ.1,11,116 గురువారం ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు.

రామాంజనేయపురంలో పోలీస్ పికెట్

రెండు కుటుంబాల మధ్య గొడవను రాజకీయ రంగు పులమడం సరైంది కాదు : సీఐ వెంకట్రావు

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాంజనేయపురంలో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు సంతమాగులూరు సీఐ వెంకట్రావు తెలిపారు. రెండు కుటుంబాల మధ్య పిల్లల విషయంలో జరిగిన గొడవను రాజకీయ రంగు పులిమి రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక పత్రికలో అసత్యపు వార్తలు రాసి రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా చేశారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. రెండు కుటుంబాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

27న శిడి మహోత్సవం

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని గ్రామ దేవత శ్రీ జగ్గమని గంగా భవానీ అమ్మవారి శిడి మహోత్సవం 27వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ప్రకటనలో తెలిపారు. గంగా భవానీ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శిడి మహోత్సవాన్ని జరుగునుందని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

మార్టూరు పంచాయతీ అభివృద్ధికి కృషి

పబ్లిక్ టాయ్‌లెట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి



పబ్లిక్ టాయ్‌లెట్ల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి కలిగిన మార్టూరు పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మార్టూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.20 లక్షల వ్యయంతో పెద అండరుపాస్ వద్ద నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. అలాగే గ్రామ పంచాయతీ వారు కొనుగోలు చేసిన చెత్తను తరలించే 10 మినీ రిక్షాలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాజధాని అమ రావతికి దగ్గరలో ఉన్న మార్టూరు పంచాయతీ భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రానున్న కాలంలో పూర్తి స్థాయిలో అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మార్టూరు చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు నిధుల మంజూరు, ఎఫర్ట్ సంస్థ సహకారంతో గ్రామంలో మొక్కల ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. జాతీయ రహదారిని విస్తరించే క్రమంలోనే 2015లో మార్టూరు సెంటర్‌లో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నాగరాజుపల్లి రేడ్, కొణిదెనరోడ్ వద్ద మినీ అండర్ పాస్, రాజుపాలెం కూడలి వద్ద పెద అండరుపాస్, జొన్నతాళి రోడ్డు వద్ద మినీ అండరుపాస్ మంజూరుకు కృషి చేశానన్నారు. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయి నీటిని అందిస్తామ న్నారు. అనంతరం మార్టూరు సెంటర్లో ఆర్వో ప్లాంట్ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించగా, సభావేదిక వద్ద ఉన్న శ్రీరాం రామయ్య గోవిందమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీరాం శేషగిరిరావు ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.2లక్షల చెక్కును విరాళంగా ఎమ్మెల్యే ఏలూరికి అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్, ఏఈ బ్రహ్మయ్య, సర్పంచ్ భూక్యా సుమితా బాయి, షేక్ రజాక్, కామినేని జనార్దన్, ఆదినారాయణ, గుర్రం శ్రీను,బండి నాగేశ్వరరావు, జంపని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో కుసుమకుమారి, ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నగదు జమ

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు చేసిన కూలీలకు కూలి డబ్బులు జమ అయినట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. మార్చి వరకు కూలీలకు రావాల్సిన నగదు మొత్తం కూలీలు బ్యాంకు అకౌంట్లకు ప్రభుత్వం జమ చేసిందని ఎంపీడీవో తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీహర్ష

బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బీపీ, షుగర్ ఉన్న వారు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని మోదేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.శ్రీహర్ష అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కలవకూరు గ్రామంలోని హెల్త్ సెంటర్‌లో ఎన్‌సీడీసీడీ సర్వేలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలను ఆయనతోపాటు సిబ్బంది చేశారు. గ్రామాల్లో సర్వే చేసి ఎన్‌సీడీసీడీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు, ఎంపీహెచ్ఈ నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ కన్యాకుమారి, అబ్దుల్ సత్తార్, అశోక్ పాల్గొన్నారు.

భర్త మరణిస్తే భార్యకు పింఛన్

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందిన వెంటనే భార్యకు పింఛన్ అందుతుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.